సోమవారం
24-07-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 33
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

న్యాయ సంస్కరణలకు వ్యతిరేకంగా పార్లమెంటుకు 'ప్రజాస్వామ్య మార్చ్'

న్యాయ వ్యవస్థలో నెతన్యాహు ప్రభుత్వం ప్రతిపాదించిన సంస్కరణలను ఇజ్రాయిల్ ప్రజలు తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. ఇదే అంశమై చాలా రోజులుగా ప్రదర్శనలు, నిరసనలు, ఆందోళనలు కొనసాగుతున్నాయి. ప్రజా నిరసనలు 29వ వారంలోకి చేరుకున్నాయి.

2 లో

మోదీ అనాలోచిత నిర్ణయాలతో
బియ్యం కొరత

- దేశ, విదేశాల్లో పెరిగిన ధరలు
- కేంద్రం ప్రకటనలతో సాగు తగ్గించిన రాష్ట్రాలు



న్యూఢిల్లీ:
కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి కొరవడిన ముందు చూపు కారణంగా దేశ ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఆకలితో అల్లాడుతున్నారు. దేశ ప్రజల అవసరాలకు ఏ మేరకు ఆహార ధాన్యాలు అవసరమో కూడా తెలుసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. గోదాముల్లో ఆహార ధాన్యాలు పుష్కలంగా ఉన్నాయని ప్రగల్భాలు పలికి సంవత్సరం గడవక ముందే దేశంలో పరిస్థితులు తారుమారయ్యాయి. దానితో మోదీ ప్రభుత్వం అకస్మాత్తుగా బియ్యం ఎగుమతులపై నిషేధం విధించింది. ప్రభుత్వ తత్తరపాటు నిర్ణయాలు దేశ ప్రజలనే కాకుండా విదేశాల్లో ఉంటున్న భారత పౌరులను కూడా తీవ్ర ఇక్కట్లకు గురిచేస్తున్నాయి. ఈ నిర్ణయం ప్రపంచం మొత్తంపై ప్రభావం చూపుతుందని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. ఇప్పటికే ఉక్రెయిన్-రష్యా యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా ఆహార ధాన్యాల ధరలు విపరీతంగా పెరిగాయి. అత్యధిక బియ్యం ఉత్పత్తిదారు అయిన చైనాలో కూడా వాతావరణం అనుకూలించక దిగుబడి తీవ్రంగా పడిపోయింది. బియ్యం ఎగుమతులపై మోదీ సర్కారు ఉన్నట్టుండి నిషేధం విధించటంతో అమెరికాలోని భారతీయులు ముఖ్యంగా బియ్యం అధికంగా తినే తెలుగువారు హాహాకారాలు చేస్తున్నారు. ముందుముందు బియ్యం దొరక్కపోవచ్చన్న భయంతో షాపింగ్ మాల్స్‌పైబడి బస్తాలకు బస్తాలు కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దీంతో తెలుగువారు అధికంగా ఉండే ప్రాంతాల్లోని మాల్స్‌లో బియ్యం నో స్టాక్ అని బోర్డులు కనిపిస్తున్నాయి. అనేక మాల్స్ ముందు బియ్యం కొనేందుకు ప్రజలు కిలోమీటర్ల దూరం క్యూ లైన్లలో నిలబడ్డారు.

గోదాముల్లో ధాన్యం మురిగిపోతున్నది. దేశ భవిష్యత్ అవసరాలకు సరిపడా ధాన్యం నిల్వలున్నాయి. కాబట్టి రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని తాము కొనుగోలు చేసే పరిస్థితి ఉండదనీ, అందువల్ల వరి సాగు నుంచి ఇతర పంటల సాగుకు రైతులను ప్రోత్సహించబోమని 2021 డిసెంబరు 3న మంత్రి గోయల్ పార్లమెంట్‌లో చేసిన ప్రకటనలో రాష్ట్రాలకు మంత్రి ఉచిత సలహా ఇచ్చారు. ధాన్యం పండిస్తే ఎగుమతులకు కూడా అవకాశం లేదని తెలిపారు. కేంద్రం వరి సాగు వద్దనడంతో చాలా రాష్ట్రాలు సాగు తగ్గించాయి. దీంతో దేశ వ్యాప్తంగా సాగు 50 శాతం తగ్గిపోయింది. ధాన్యం ఉత్పత్తి తగ్గిపోయిన ఫలితంగా నేడు బియ్యం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఆహార ధాన్యాల నిల్వలు భారీగా ఉన్నాయన్న నోటితోనే బియ్యం కొరత ఉన్నదని కేంద్రం గగ్గోలు పెడుతున్నది. ధాన్యం ఉత్పత్తి పెంచి కొరత తీర్చడం చేతగాక బియ్యం ఎగుమతులపై నిషేధం

- మిగతా 2 లో

మరో ఘోరం

- స్వాతంత్ర్య సమరయోధుని భార్య సజీవ దహనం
- మే28న ఘటన
- మణిపూర్‌లో అమానుషాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి

సీరా:
మణిపూర్‌లో అమానుషాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. మహిళల నగ్న ఊరేగింపు, సామూహిక అత్యాచారం ఘటనను మరువక ముందే స్వాతంత్ర్య సమరయోధుడు ఎస్.చుర చాంద్ సింగ్ సతీమణి ఇబెటోంబి (80)ను ఇంట్లో బంధించి, నిప్పు పెట్టి సజీవంగా దహనం చేసిన హృదయ విదారక ఘటన బయట పడింది. ఈ ఘటన కక్చింగ్ జిల్లా, సిరౌ గ్రామంలో మే 28వ తేదీ మధ్యరాత్రిలో జరిగింది. రాష్ట్రం అట్టుడికి పోతున్న సమయంలో ఈ అమానుషం జరిగినట్లు సిరౌ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సాయుధ గుంపు ఈ పాశవికానికి పాల్పడినట్లు వెల్లడైంది. బాధితురాలి మనుమడు ప్రేమ్‌కాంత (22) మీడియాతో మాట్లాడుతూ 'ఆ రోజు మాపై దాడి జరిగినప్పుడు పారిపోండి... ముందు మీ ప్రాణాలు కాపాడుకోండి తర్వాత నా కోసం రండి అని అవ్వ

- మిగతా 2 లో

ఆర్టీసీ బస్సుల్లో
కనిపించని ఫస్ట్ ఎయిడ్

ప్రజల వద్దకే వైద్య సేవలంటూ 108, 104, ఫ్యామిలీ ఫిజీషియన్‌పై దృష్టిపెట్టిన వైసీపీ ప్రభుత్వం, ప్రమాదవశాత్తు ప్రయాణికులు గాయపడితే తక్షణ వైద్యసేవలు అందించేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఏర్పాటు చేసిన ఫస్ట్‌ఎయిడ్ కిట్లను సిక్ యూనిట్‌లో పడేయడం విచారకరం. కాలానుగుణంగా నిరర్థక పాలనా వైరస్ సోకి మంచానపడ్డ ఫస్ట్ ఎయిడ్‌కు చికిత్స చేసి ప్రజా రవాణాకు అందుబాటులో తేవాలన్న ఆలోచన పాలకులు, అధికారుల్లో లేకపోవడం ప్రయాణికుల భద్రతపై వారికున్న ఆసక్తిని తెలుపుతోంది. తమది ప్రజారంజక పాలన అంటూనే చార్జీలు పెంచుతూ పేద, సామాన్య, మధ్య తరగతి ప్రయాణికులపై మోయలేని భారం వేస్తున్న ప్రభుత్వానికి, బస్ ప్రమాదానికి గురైతే క్షతగాత్రులకు ఉపశమన చర్యలు చేపట్టాలన్న స్పృహలేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదాయ సముపార్జనపైనే దృష్టి తప్ప ప్రయాణికుల సురక్షితంపై లేకపోవడం విచారకరం. సుమారు రూ.200 కూడా ఖర్చుగాని ఫస్ట్ ఎయిడ్ కిట్‌లను బస్సుల్లో అందుబాటులో ఉంచకపోవడంలో ఆంతర్యమేమిటోనని ప్రయాణికులు నిలదీస్తున్నారు.

2 లో

వెంటాడుతున్న వరద భయం

- విలీన మండలాల ప్రజల్లో ఆందోళన
- గ్రామాలను వీడని వరద
- నిలకడగా గోదావరి నీటిమట్టం
- కొనసాగుతున్న ఒకటవ ప్రమాద హెచ్చరిక

2 లో

'చెత్త' భారం

- ఆలస్యంగా బిల్లుల జారీ
- ఏడునెలలకోసారి బాదుడు
- ఒకేసారి రూ.వందల్లో పన్నులు
- రూ.750 కోట్ల వసూలు లక్ష్యం

2 లో

అవినీతి అధికారులపై చైనా ఉక్కుపాదం

బీజింగ్: అవినీతి అధికారులపై చైనా ఉక్కుపాదం మోపింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 3,16,000 అవినీతికి సంబంధించిన కేసులను అధికారులు విచారించినట్లు కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) క్రమశిక్షణ పర్యవేక్షణ కేంద్ర కమిటీ నివేదించింది. జాతీయ పర్యవేక్షణ కమిటీ ప్రకారం 2,58,000 మంది అధికారులపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడైంది. వీరిలో 18 మంది ప్రావిన్షియల్ స్థాయి అధికారులు లేక మంత్రి స్థాయిలో ఉన్నట్లు పేర్కొంది. పార్టీకి సంబంధించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. దేశీయ వ్యవస్థల్లో సాంప్రదాయ వాదం, బ్యూరోక్రసీ, దుబారాను కట్టడి చేసేందుకు ఐదేళ్లలో క్షేత్రస్థాయిలో స్వచ్ఛమైన రాజకీయాలు, అవినీతి నిర్మూలనకు సీపీసీ పటిష్ఠ చర్యలు చేపట్టింది. ఇలాంటివే పార్టీకి పెద్ద ముప్పుగా పరిణమిస్తాయని అధిష్ఠానం భావిస్తుంది. చైనా ఇటీవల స్కైనెట్ ప్రచారానికి సంబంధించి 2023 ఎడిషన్‌ను విడుదల చేసింది. అవినీతి, అక్రమాలకు పాల్పడిన తర్వాత ఇతర దేశాల్లో ఆశ్రయం పొందేందుకు పలాయనం సాగించే నాయకులను అదుపులోకి తీసుకోవడమే ఈ ప్రచార ఉద్దేశం.

న్యాయ సంస్కరణలకు వ్యతిరేకంగా

పార్లమెంటుకు 'ప్రజాస్వామ్య మార్చ్'

29 వారాలుగా ఇజ్రాయిల్‌లో నిరసనలు - నేడు బిల్లుపై ఓటింగ్

జెరూసలేం: న్యాయ వ్యవస్థలో నెతన్యాహు ప్రభుత్వం ప్రతిపాదించిన సంస్కరణలను ఇజ్రాయిల్ ప్రజలు తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. ఇదే అంశమై చాలా రోజులుగా ప్రదర్శనలు, నిరసనలు, ఆందోళనలు కొనసాగుతున్నాయి. ప్రజా నిరసనలు 29వ వారంలోకి చేరుకున్నాయి. కానీ నెతన్యాహు ప్రభుత్వం మాత్రం ఏకపక్షంగా సంస్కరణలను ఆమోదించేందుకు పార్లమెంటులో ఓటింగ్‌కు సిద్ధమైంది. సోమవారం ఓటింగ్ జరగనుంది. దీంతో 'మార్చ్ ఆఫ్ డెమొక్రసీ' పేరిట జెరూసలంలోని పార్లమెంటు భవనం వరకు మార్చ్‌ను నిరసనకారులు చేపట్టారు. మార్చ్‌లో వేలాది మంది పాల్గొని నెతన్యాహు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నగర శివరాల్లోని చార్డ్స్ బ్రిడ్జి నుంచి ప్రారంభమైన మార్చ్ నెస్సెట్ (పార్లమెంటు) వైపుకు సాగింది. తొలుత 35వేల మంది ప్రదర్శనకారులు ఉండగా ఆ మార్గంలో వచ్చేపోయే వారు కూడా పాల్గొని సంఘీభావం తెలిపారు. ఇదిలావుంటే 10వేల మంది ఇజ్రాయిలీ మిలటరీ రిసర్విస్టులు తమ విధులను బహిష్కరించనున్నట్లు ప్రకటించారు. ప్రజాస్వామ్య ప్రదర్శన క్రమంలో జెరూసలేంలోకి అన్ని ప్రవేశాలను పోలీసులు మూసివేశారు. శనివారం దేశవ్యాప్తంగా 150 ప్రాంతాల్లో ప్రదర్శనలను చేపట్టినట్లు ఆందోళనకు నేతృత్వం వహించే సంఘాలు తెలిపాయి. న్యాయ సంస్కరణల బిల్లు చట్టమైతే గనుక తమ నిర్ణయాలను మరింతగా ప్రచారం చేసుకోవడంతో పాటు అధికారులను ఎన్నుకునే అధికారాన్ని ప్రభుత్వానికి లభిస్తుంది. ఈ సంస్కరణలు ఇజ్రాయిల్ ప్రజాస్వామ్యానికి ముప్పుగా ప్రతిపక్షాలు చెబుతున్నాయి.

నెతన్యాహుకు గుండె శస్త్రచికిత్స

ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు ఆదివారం గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగింది. ఆమెకు వైద్యులు పేస్ మేకర్‌ను అమర్చారు. షీబా మెడికల్ సెంటర్‌లో నెతన్యాహుకు సర్జరీ జరిగినట్లు ఆయన కార్యాలయం ఒక ప్రకటన వెలువరించింది. ఆయన వెంట ఉప ప్రధాని యర్విన్ లెవిన్ ఉన్నట్లు పేర్కొంది. తల తిరగడం, మైకం రావడం వంటి ఇబ్బందులతో నెతన్యాహు (73) ఆసుపత్రిలో చేరారు. శస్త్రచికిత్స విజయవంతమైందని, నెతన్యాహు ఆరోగ్య పరిస్థితి బాగుందని, కార్డియాలజీ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి పేర్కొంది.

క్యూబాను ఆర్థికంగా దెబ్బతీస్తున్న అమెరికా ఆంక్షలు

హవానా: అమెరికా ఆంక్షలు, నిషేధాజ్ఞలు క్యూబాను ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయని, అభివృద్ధి మార్గాలకు అడ్డుకట్ట వేస్తున్నాయని ఆ దేశాధ్యక్షుడు మిగుల్ డియాజ్ కెనెల్ వెల్లడించారు. హవానాలోని నేషనల్ అసెంబ్లీ ఆఫ్ పీపుల్స్ పవర్‌లో ఆయన మాట్లాడుతూ కరీబియన్ దేశాభివృద్ధికి, ఆర్థిక వృద్ధికి నష్టం కలిగించే అమెరికా ఆంక్షలు, కేపిటలిజంతో ప్రపంచంలో అసమానతలు పెరిగాయన్నారు. క్యూబాపై అమెరికా ఆర్థిక యుద్ధం, ప్రపంచ ఆర్థిక మాంద్యం, మహమ్మారి అనంతరం పురోగతి నెత్తనడన సాగడం వంటివి క్యూబా ఆర్థిక వృద్ధి వ్యూహాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నట్లు తెలిపారు. ఇంధనం, వ్యవసాయం, చక్కెర పరిశ్రమల్లో విదేశీ పెట్టుబడుల కార్యకలాపాలు త్వరలో ప్రారంభమవుతాయని వెల్లడించారు. వచ్చే మూడేళ్లలో మాక్రో ఎకనామిక్స్ సుస్థీకరణ కోసం సంస్థాగత సంస్కరణలకు క్యూబా పూనుకుందని, తద్వార ప్రగతిపథంలో పయనించాలని భావిస్తోందని అధ్యక్షుడు మిగుల్ డియాజ్ కెనెల్ తెలిపారు.

కేతు, రమణ సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర-విజయవాడ: మనుషుల మధ్య అంతరాలు పెరుగుతున్న నేపథ్యంలో మానవీయ విలువల్ని తమ రచనలతో అభ్యుదయ పంథాల్లో చెప్పిన రచయితలు కేతు విశ్వనాథరెడ్డి, శ్రీరమణ అని వక్తలు కొనియాడారు. ఇటీవల మరణించిన రచయితలు కేతు విశ్వనాథరెడ్డి, శ్రీరమణల సంస్మరణ సభ విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక బుక్‌ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో ఆదివారం సొసైటీ అధ్యక్షులు టి.మనోహరనాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మినారాయణ మాట్లాడుతూ కేతు విశ్వనాథరెడ్డి రచనలను విశ్లేషించారు. రాయలసీమ బ్రతుకులను తన కవిత్వంలో జనబాహుళ్యంలోకి తీసుకెళ్లారని తెలిపారు. సమాజంలో వెళ్లూనుకున్న మూఢ విశ్వాసాలను పారద్రోలే విధంగా సామాన్యులకు అర్థం అయ్యే రీతిలో అభ్యుదయ రచనలు చేశారని చెప్పారు. ఆల్ ఇండియా రేడియో విశ్రాంత ఉద్యోగి, కవి పన్నాల సుబ్రహ్మణ్య భట్టు శ్రీరమణ రచనలపై ప్రసంగించారు. పేరడీ కవిత్వం రాయటంలో శ్రీరమణ దిట్ట అన్నారు. ఆయన రాసిన 'మిథునం' నవల చాలా ప్రజాదరణ పొందిందన్నారు. కేతు, రమణ మరణం సాహితీ లోకానికి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి కె.లక్ష్మయ్య, మాజీ అధ్యక్షులు వెంకట నారాయణ, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమి అధ్యక్షులు గోళ్ల నారాయణ రావు, సీనియర్ పాత్రికేయులు మహబూబ్ ఆజం తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి: జగదీశ్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు: అనంతపురం జిల్లా రాయదుర్గంలో పత్రికా విలేకరి వెంకటేశ్ పై స్థానిక ఎమ్మెల్యే చేయించిన దమనకాండను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీశ్ ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. స్థానిక ఎమ్మెల్యే రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా వార్త రాశాడని మండి పడ్డ ఎమ్మెల్యే ఆ విలేకరి ఇంటిని జేసీబీ ద్వారా కూలగొట్టించడమేకాక ఆయనపై అక్రమ కేసులు బలాయించడం సమంజసం కాదని జగదీశ్ అన్నారు. ఈ విషయాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందని ప్రజాస్వామ్యంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండే పత్రిక విలేకరిపై ఇటువంటి దాడి చేయడం ఎమ్మెల్యే కు తగదన్నారు. ఎమ్మెల్యే చర్యను కోర్టు సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేసి శిక్షించాలని జగదీశ్ డిమాండ్ చేశారు.

మరో ఘోరం (మొదటిపేజీ తరువాయి)

చెప్పింద'ని అన్నారు. రెప్పపాటులో మృత్యువను తప్పించుకున్నట్లు చెప్పారు. అవ్వను కాపాడే ప్రయత్నంలో తన చేతికి, కాలికి బుల్లెట్లు తగిలా యన్నారు. 'నా కోసం తిరిగి రండి' అన్నవే ఆమె చివరి మాటలని భావోద్వేగానికి గురయ్యారు. 'తెల్లవారుజామున 2.10గంటలకు మేమంతా పారిపోయాం. మాతో రమ్మని అవ్వ వినలేదు. ముందు మీ ప్రాణాలను కాపాడుకోండి తర్వాత నా కోసం రండి అన్నారు. ఆ తర్వాత స్థానిక ఎమ్మెల్యే ఇంట్లో ఆశ్రయం పొందాం. అన్ని వైపుల నుంచి కాల్పులు జరుగుతుండటంతో ప్రాణ భయంతో వణికిపోయాం. కాస్త ధైర్యం తెచ్చుకొని ఉదయం 5.30-6 గంటలప్పుడు అవ్వ కోసం తిరిగొస్తే బూడిదైన ఇల్లు కనిపించింది' అని తెలిపారు. ఆ కళారాత్రి మిగిల్చిన గాయాల నుంచి నేటికీ కోలుకోని ప్రేమకాంత, హింస జరిగిన రెండు నెలల తర్వాత ఊరికి వస్తే తన ఇంటి స్థానంలో కాలిపోయిన చెక్క ముక్కలు, రేకులు కనిపించాయి. శిథిలాల్లో అవ్వ చిత్రపటంతో పాటు తన తాతను మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం సన్మానించిన ఫొటో లభించాయి. ఇబెటోంబి మంచం ఉండే స్థలంలో ఆమె అస్తికలు చెల్లాచెదురుగా పడివున్నట్లు సమాచారం. రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌కు 45కిమీల దూరంలోని సిరౌ గ్రామంలో హింస జరిగినప్పుడు సాయుధ గుంపులు ఇళ్లకు నిప్పు పెట్టాయి. ఇష్టమొచ్చిన కాల్పులు జరపడంతో ఇళ్ల గోడలకు తూటా చిల్లులు పడ్డాయి. హింస వల్ల అత్యధిక ప్రభావితమైన గ్రామం ఇదే కాగా కొద్ది దూరంలోని మార్కెట్ దెయ్యాల దిబ్బగా మారింది. అక్కడ చావునిశబ్దం తప్ప ఏమీ మిగలలేదు.

బియ్యం కొరత

(మొదటిపేజీ తరువాయి)

విధించడం సర్వత్రా విమర్శలకు కారణమైంది. కేంద్ర ప్రభుత్వ ముందుచూపులేని నిర్ణయాలపై దేశం యావత్తు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. బియ్యం, ధాన్యం నిల్వలపై కేంద్రం ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి పీయూష్ గోయల్ రెండుమూడు నెలల వ్యవధిలోనే నాలుగు మాటలు మార్చడాన్ని తప్పుపడుతున్నారు. దేశంలో నాలుగేళ్లకు సరిపడా బియ్యం నిల్వలున్నాయని ప్రకటించిన ఏడాదిన్నరకే దేశంలో బియ్యం కొరత ఎందుకు ఏర్పడిందని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. దేశంలో వ్యవసాయాన్ని గాడిన పెట్టి ధాన్యం ఉత్పత్తి పెంచడం చేతగాకే కేంద్రం ఈ నిర్ణయం తీసుకొన్నదని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 2022 మార్చిలో నూకల ఎగుమతిపై కేంద్రం నిషేధం విధించింది. ఆ తర్వాత బాస్మతియేతర బియ్యం ఎగుమతిపై 20 శాతం పన్ను విధించింది. దీనిపై అప్పట్లోనే పెద్ద దూమరం రేగడంతో వెనక్కి తగ్గింది. ప్రస్తుతం ఉత్పత్తి తగ్గి దేశీయంగా బియ్యం కొరత ఏర్పడడంతో కొద్ది రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం బియ్యం ఎగుమతులపై నిషేధం విధించింది.

ఆర్టీసీ బస్సుల్లో కనిపించని ఫస్ట్ ఎయిడ్

విశాలాంధ్ర-డిజిటల్: ప్రమాదవశాత్తు ప్రయాణికులు గాయపడితే ఉపశమన చర్యలు చేపట్టేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఏర్పాటు చేసిన ఫస్ట్ ఎయిడ్ కిట్లకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) స్వస్తి పలికింది. 'ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం, ప్రైవేట్ బస్సుల్లో ప్రమాదం' అంటూ పెద్ద అక్షరాలతో లిఖించినా, ఊకదంపుడు ప్రచారాలు చేసినా ఆచరణలో మాత్రం ప్రయాణికుల సుఖవంతమైన ప్రయాణంపై యాజమాన్యం శీతకన్ను వేసినట్టు స్పష్టమౌతోంది. టికెట్ రేట్లు పెంచి ఆదాయాన్ని దండుకోవడంపైనే దృష్టి పెట్టిన సంస్థ ప్రయాణికులకు జరగరానిది జరిగితే తక్షణమే వైద్యసేవలు అందించేందుకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచకపోవడం విచారకరం. ప్రజల వద్దకే వైద్యసేవలంటూ ప్రవేశపెట్టిన 108, 104, ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు పక్కనపెడితే, ప్రమాదం జరిగిన వెంటనే వైద్య నిపుణుల వద్దకు తీసుకెళ్లే లోపు ప్రథమ చికిత్స వల్ల క్షతగాత్రుల్లో మనోధైర్యాన్ని నింపవచ్చన్న స్పృహను పాలకులు, సంస్థ యాజమాన్యం గాలికొదిలేయడం బాధాకరం.

గతంలో ఎర్రబస్సుగా పిలిచే ఆర్టీసీ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ డ్రైవర్ సీటు వెనుక గల క్యాబిన్‌కు ఏర్పాటు చేసి ఉండేది. కాలానుగుణంగా అవి అలంకారప్రాయంగా మిగిలి చివరికి ఉనికినే కోల్పోయాయి. ప్రైవేట్ బస్సుల పోటీని తట్టుకునేందుకు యాజమాన్యం అల్ట్రా డీలక్స్, సూపర్ డీలక్స్, సూపర్ లగ్జరీ, మెట్రో లగ్జరీ, ఇంద్ర, గరుడ, రాజధాని, అమరావతి తదితర పేర్లతో ఏసీ బస్సులు, స్లీపర్ కోచ్‌లు ప్రవేశపెట్టినా ఆర్టీవో నిబంధనల ప్రకారం బస్సుల్లో తప్పనిసరిగా ఉండాల్సిన ఫస్ట్ ఎయిడ్ కిట్లు మాత్రం భూతద్దం పెట్టి వెదికినా నేడు కనిపించవు. వాటిస్థానే ప్రయాణికులకు వినోదం కోసం అంటూ ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి ఫస్ట్ ఎయిడ్ కిట్లను సిక్ యూనిట్‌లో పడేశారు. సడన్ బ్రేక్ వేసినప్పుడు గాని, ఊహించని ప్రమాదం సంభవించినప్పుడు గాని ప్రయాణికులు గాయపడితే, 108 వాహనం వచ్చే వరకూ క్షతగాత్రుల హాహాకారాలతో ఆ ప్రదేశమంతా భయానక వాతావరణం అలముకుంటుందన్న సత్యాన్ని విస్మరించడాన్ని ప్రయాణికులు జీర్ణించుకోలేకపోతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా లేకపోలేదు. ఆర్టీసీ యాజమాన్యం నిబంధనల ప్రకారం డ్రైవర్‌కు, కండక్టర్‌కు ఫస్ట్ ఎయిడ్ చికిత్సపై శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. తదనంతరం నియామక ఉత్తర్వులు ఇచ్చి బసు నడిపేందుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. కానీ నేడు సిబ్బంది అవేమీ లేకుండానే నేరుగా బసు నడుపుతుండంతో ప్రమాదవశాత్తు ప్రయాణికులు గాయపడితే ఏం చేయాలో తెలియనిస్థితి వారిలో ఆవరించింది. ఆర్టీవో నిబంధనల ప్రకారం ప్రైవేట్ ట్రావెల్ బస్‌లు, చివరకు స్కూల్ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలి. ఆ శాఖ అధికారులు మాత్రం నిబంధనలు తుంగలో తొక్కి ప్రభుత్వ బస్‌లే కదా అన్న ఉదారత, నిర్లక్ష్యంతో వ్యవహరిస్తుండడం విచారకరం.

'చెత్త' భారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:

చెత్తపై పన్ను విధించడం ద్వారా వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై మోయలేని భారాన్నే మోపింది. దీనిపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. అయితే నెలనెలా చెత్త బిల్లు కట్టడమే కష్టంగా ఉందనుకుంటుంటే... ప్రభుత్వ అసమర్థత వల్ల ప్రజలపై మరింత భారం పడుతోంది. ప్రతినెలా చెత్త పన్నుల వసూళ్లల్లో జాప్యం జరుగుతోంది. ఏడు నెలలకోసారి బిల్లులిచ్చి, వాటిని ముక్కుపిండి మరీ వసూలు చేయి స్తోంది. ఈ విధానాలతో సామాన్యుడిపై ఆర్థిక భారం పడుతోంది. ఎవరికీ చెప్పుకోలేని దుస్థితిలో ప్రజలున్నారు. వాస్తవంగా ప్రభుత్వం చెత్తపన్ను వేయడమే పెద్ద తప్పు. అదీ కేటగిరీల వారీగా వేయడంతో మురికివాడల ప్రజలకు పన్నుల్లో కాస్త వెసులుబాటు కలిగింది. ప్రతినెలా రూ.30 చెత్త పన్నుగా విధించారు. ఇప్పుడు ఏకంగా ఏడ్నెళ్ల కోసారి రూ.210 బిల్లు ఇచ్చి కట్టాలంటూ వలంటీర్ల ద్వారా, సచివాలయ వ్యవస్థ ద్వారా ఒత్తిడి చేయడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. రోజు వారీ కూలి పనులు చేసుకుని, అద్దె ఇళ్లల్లో నివసించే వారికి ఇది పెద్ద భారంగా మారింది. జూన్ 2022 నుంచి డిసెంబరు 2022కు సంబంధిం చిన చెత్త బిల్లులను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా సచివాలయాలకు జారీజేస్తున్నారు. అక్కడి నుంచి వలంటీర్లు ఈ బిల్లుల వసూళ్లల్లో నిమగ్నమయ్యారు. ప్రతిరోజూ చెత్త బిల్లులు కట్టాలంటూ వలంటీర్లు తమ పరిధిలోని వాట్సాప్ గ్రూపుల్లో మెసేజ్‌లు పెడుతున్నారు. ఏడు నెలలకోసారి ఈ బిల్లులను పంపడం వల్ల సామాన్యులంతా ఆర్థిక అవస్థలు పడుతున్నారు.

ప్రజల నుంచి తీవ్ర నిరసన

రాష్ట్ర ప్రభుత్వం చెత్త పన్నులను ప్రవేశపెట్టడంతో ప్రజల నుంచి తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. చెత్త పన్నులు రద్దు చేయాలంటూ వామపక్ష, ప్రజా సంఘాలు పెద్దఎత్తున ఉద్యమించాయి. ఎక్కడికక్కడ మున్సిపల్ కార్యాలయాలు, వార్డు సచివాలయాల ఎదుట నిరసనలు తెలిపినా ప్రభుత్వం దిగిరాలేదు. విలువ ఆధారిత ఆస్తి పన్నుకు ముందస్తుగా, జగన్ ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ఈ చెత్తపన్నును ప్రవేశపెట్టింది. ఇప్పటికే ఆర్టీసీ చార్జీలు, నిత్యవసరాల ధరలు క్రమేపీ పెరిగిపోతున్నాయి. విద్యుత్ చార్జీలు ప్రజలకు షాక్ కొడుతున్నాయి. టమోటా లాంటి నిత్యావసరాల ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించలేక పోతున్నాయి. వాటికి తోడుగా మధ్యలో చెత్తపన్ను వేయడం ప్రజలకు మరింత భారంగా మారింది. పట్టణ, నగర ప్రాంతాల్లోని అభివృద్ధి పనుల కోసం ప్రజలపైనే కొత్త పన్నుల భారం వేయాలనే ఆలోచనకు జగన్ సర్కారు శ్రీకారం చుట్టిన విషయం విదితమే. ప్రజలు తమ ఇళ్ల నుంచి బయట పారేసే వ్యర్థాలపై పన్ను విధించడం ద్వారా తీవ్ర విమర్శలపాలైంది. దానికితోడు ఆస్తి పన్నునూ విలువ ఆధారంగా లెక్కించి దండిగా పన్నులు వడ్డించాలని ప్రభుత్వం సూచించింది. రాష్ట్ర వ్యాప్తంగా కేటగిరీల వారీగా చెత్త పన్నును నిర్ణయించడంపై ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ప్రస్తుతం వసూలు చేస్తున్నవన్నీ గతేడాదికి సంబంధించిన చెత్త పన్నుల బిల్లులే. అంటే గతేడాది చెత్త పన్నుల వసూలులో రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ యంత్రాంగం తీవ్రంగా విఫలమైందనే విమర్శలున్నాయి. ఈ బిల్లుల వసూలు బాధ్యతల్ని వార్డు సచివాలయ వ్యవస్థకు అప్పజెప్పినా... ఆశించిన ఫలితాలు రాలేదు. ప్రజల నుంచి స్పందన లేదు. జనవరి 2023 నుంచి జులై 2023 వరకు ఇంకా బిల్లులు రాలేదు. గతేడాది జూన్ నుంచి డిసెంబరు వరకు గల బిల్లులను ఏక మొత్తంగా వసూళ్లు చేయడంతో ప్రజలకు భారంగా మారింది. క్రమంగా ప్రతినెలా బిల్లులిచ్చి వసూలు చేస్తే, వారిపై అంత భారం ఉండేది కాదు. ఒకేసారి బిల్లులు జారీ చేయడాన్ని తప్పుబడుతున్నారు. ఈ చెత్త పన్నుల ద్వారా ప్రభుత్వానికి రూ.750 కోట్లు వసూలు కానున్నాయి. అయితే చెత్త పన్నుల్ని వసూలు చేస్తున్నప్పటికీ పట్టణాలు, నగరాల అభివృద్ధి అరకొరగానే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చెత్త పన్నుల వసూళ్లను నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళలను కాపాడలేని వారు... దేశాన్ని రక్షిస్తారా?

- బేటి బచావో-బేటి పడావో అంటే ఇదేనా?
- మణిపూర్ ఘటనలో నేరస్తులను కఠినంగా శిక్షించాలి
- గుంటూరు ప్రదర్శనలో జాన్సన్‌బాబు, వలి డిమాండ్

విశాలాంధ్ర-గుంటూరు: మహిళలను కాపాడలేని వారు దేశాన్ని ఏవిధంగా రక్షిస్తారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు ప్రశ్నించారు. మణిపూర్‌లో అమానవీయ ఘటనను నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్- ఏఐవైఎఫ్ జిల్లా సమితుల అధ్వర్యంలో గుంటూరు నగరంలో ఆదివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు ప్లకార్డులు చేతపట్టుకుని దోషులను కఠినంగా శిక్షించాలంటూ పెద్దఎత్తున నినదించారు. ఈ సందర్భంగా జాన్సన్ బాబు మాట్లాడుతూ... మణిపూర్‌లో మూడు నెలలుగా దాచిపెట్టిన హింస ఒక్కసారిగా బట్టబయలైందన్నారు. మే 3వ తేదీన అక్కడ అల్లర్లు మొదలైతే... దానిని మూడు నెలల పాటు ప్రపంచానికి తెలియకుండా దాచటంలో మోదీ ప్రభుత్వం సఫలీకృతమైందన్నారు. ఇన్ని దారుణాలు జరుగుతున్నా వాటిని బయటకు తెలియకుండా ప్రభుత్వం అక్కడ ఇంటర్నెట్ లేకుండా చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఏం జరిగిందో తెలుసుకోవడానికి వెళ్లిన వారిపై కేసులు పెట్టి వారిని జైలు పాలుచేసిందని మండిపడ్డారు. మహిళలకు భద్రత కల్పించలేని బీజేపీ నేతలు సిగ్గుపడాలన్నారు. మహిళలను రక్షించలేని వీరు దేశాన్ని ఏమాత్రం రక్షిస్తారో అర్థమవుతోందన్నారు. బేటీ బచావో-బేటీ పడావో నినాదం కేవలం నినాదాలకే పరిమితమైందని విమర్శించారు. 'యుగాలు దాటొచ్చిన మనిషిని మృగాలుగా మార్చింది ఎవ్వరు? పాలిచ్చిన అమ్మల్ని నగ్నంగా ఊరేగించిన ఉన్మాదానికి ఊతమిచ్చింది ఎవ్వరు? మంటలను రాజేసింది ఎవ్వరు? గిరిజన పంటలను కాల్చేసింది ఎవ్వరూ' బీజేపీకి తెలియదా అని ప్రశ్నించారు. వివిధ జాతులకు చెందిన సాయుధ బృందాల తిరుగుబాట్లతో మణిపూర్ దశాబ్దాలుగా సతమతమవుతోందని, వీటికి ఆజ్యంపోస్తూ గత కొంత కాలంగా కొన్ని దుష్టశక్తులు ఒక జాతి ప్రజల్లో మరొక జాతి ప్రజలకు వ్యతిరేకంగా విషబీజాలు నాటి, నేటి దుస్థితికి కారణమయ్యారని విమర్శించారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వలి మాట్లాడుతూ... మణిపూర్‌లో రెండు నెలలకుపైగా విద్వేష పూరిత మంటలు చెలరేగుతున్నా, వందల మంది మరణించినా, చర్చిలు, దేవాలయాలు, విధ్వంసానికి గురైనా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. మానవత్వం పరిమళించాల్సిన మణిపూర్ గడ్డపై మానవ మృగాలు యథేచ్ఛగా సంచరించే పరిస్థితి ప్రభుత్వాల ఘోరవైఫల్యానికి ప్రబల నిదర్శనమన్నారు. వివిధ జాతులు, తరగతి ప్రజల మధ్య పెరుగుతున్న అపనమ్మకం, రోజురోజుకు తీవ్రమవుతున్న విభేదాలు, ఘర్షణల కారణంగా మణిపూర్ తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టివేయబడిందన్నారు. ఈ దుష్పరిణామం మణిపూర్ లేదా ఈశాన్య ప్రాంతానికి మాత్రమే పరిమితం కాదని, యావత్ దేశంపై ప్రభావాన్ని కలిగిస్తుందని అన్నారు. మణిపూర్ మారణకాండను, భరతమాతలపై జరిగిన పైశాచిక అత్యాచార దాడులను తీవ్రంగా ఖండిద్దామని, ఉన్మాద రాజకీయాలను, వాటి సైద్ధాంతిక భావజాలాన్ని తిప్పికొడదామని ప్రజానీకానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, మరియదాసు, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు జ్ఞానదీప్, యస్వంత్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్‌కుమార్, వెంకటేశ్వర్ రెడ్డి, సాయి, బన్నీ, ఇస్మాయిల్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

- ప్రగతిశీల సంఘాల డిమాండ్
- విజయవాడలో నిరసన ప్రదర్శన

విశాలాంధ్ర-విజయవాడ: మణిపూర్‌లో ఆదివాసీలు, మహిళలపై సాగుతున్న అత్యాచారాలు, హింసాకాండను నిరసిస్తూ ప్రగతిశీల, అభ్యుదయ ప్రజాసంఘాల కూటమి 'సంగమం' అధ్వర్యంలో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. స్థానిక ఎల్ఐసీ భవనం నుంచి బీసెంట్ రోడ్, రాజగోపాలాచారి వీధి, కార్ల్ మార్క్స్ రోడ్డు మీదుగా లెనిన్ సెంటర్ వరకు ప్రదర్శన సాగింది. ఆదివాసీల హక్కులు రక్షించాలని, మణిపూర్‌లో పాలక బీజేపీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని నినాదాలు చేశారు. లెనిన్ సెంటర్ వద్ద జరిగిన సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు బుడ్డిగ జమిందార్ (ప్రోగ్రెసివ్ ఫోరం), శాంతిశ్రీ (జర్నలిస్ట్), ఖనితా (జమా యితే ఇస్లాం), అరుణ కుమార్ (అరసం), కాట్రగడ్డ స్వరూపరాణి (ఐద్వా), పద్మ (పిఓడబ్ల్యు), విజయ ప్రకాష్ (సంగమం) యు.వి.రామరాజు (ఎంబీవీకే), దివికుమార్ (జనసాహితి) తదితరులు మాట్లాడుతూ మణిపూర్ ఘటనపై దృష్టి మరల్చే విధానమే ఉమ్మడి పౌరసత్వం అన్నారు. మతాలు, జాతుల తెగల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం అర్ఎస్ఎస్, పాలక బీజేపీ విధానం అంటూ మండిపడ్డారు. మణిపూర్‌లో దాదాపు నాలుగు నెలలుగా అమానుష ఘటనలు జరుగుతున్నప్పటికీ ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలు మౌనంగా ఉన్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు గోళ్ల నారాయణ రావు, రాజారావు, ఉషా, రాధ, రవిచంద్ర, కోటి, ఎన్ అంజయ్య, ఎమ్‌వీ ఆంజనేయులు, గుండు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న వరద భయం

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు:

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమక్రమంగా తగ్గుతోంది. అయితే ఇప్పటికీ ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ఇంకాస్త తగ్గితే ప్రమాద హెచ్చరికను తొలగిస్తామని కలెక్టర్ చెబుతున్నారు. అయితే అల్లూరి సీతారామరాజు జిల్లా విలీన మండలాల ప్రజలకు మాత్రం మళ్లీ వరద భయం పట్టుకుంది. ఇప్పటికీ భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 43 అడుగులు దాటే ప్రవహిస్తోంది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నానికి గోదావరి 43.4 అడుగుల వద్ద ప్రవహిస్తోంది. గోదావరి నీటిమట్టం 42 అడుగులకు తగ్గితేనే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకోనున్నారు. అయితే వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో దేవీపట్నం, చింతూరు, ఎటపాక, కూనవరం, వీఆర్ పురం లోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేవీపట్నంలోని పోచమ్మ గండి వద్ద అమ్మవారి ఆలయం ఇంకా పూర్తిగా వరద నీటిలోనే మునిగి ఉంది. ఇక్కడి ముంపు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించిన ప్పటికీ తాళ్లూరు గ్రామానికి చెందిన ఓ 50 కుటుంబాలు పునరావాసం సరిగా లేదని గ్రామంలోనే ఉండిపోయారు. దీంతో ఆ కుటుంబాల కి చెందిన ప్రజలను అక్కడ నుంచి తరలించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎటపాక, కూనవరం మండలాలకు చెందిన అనేక గ్రామాలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. వీఆర్ పురం, చింతూరు. మండలాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మరో వైపు శబరి నది వరద ఉధృతి తక్కువ ఉండటంతో ఆంధ్రప్రదేశ్ నుంచి చింతూరు మీదుగా ఒడిశాకు రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు కొనసాగుతుండడం, రాష్ట్రంలో కూడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండడంతో జిల్లాలోని విలీన మండలాల గ్రామాల ప్రజలు భయం గుప్పిట్లో కాలం గడుపుతున్నారు.

తుంగభద్రకు పోటెత్తిన వరద

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతాల్లో గత నాలుగు రోజుల నుండి వర్షాలు కురుస్తుండటంతో తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తింది. జలాశయంలోకి సుమారు 60 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయం ఎగువన కర్నాటకలోని శివమొగ్గ అగుంబే తీర్థహళ్లి తదితర ప్రాంతాల్లో ఆశాజనకంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయానికి 60వేల క్యూసెక్కుల పైగా వరద నీరు చేరింది. ఈనెల 20వ తేదీన తుంగభద్ర జలాశయానికి 9150 క్యూసెక్కులు రాగా 21న 13250క్యూసెక్కులు, 22న 41,572 క్యూసెక్కుల నీరు వచ్చింది. దీంతో జలాశయం మొత్తం నీటి నిల్వ 21.356 టీఎంసీలకు చేరింది. ఇది ఇలాగే కొనసాగితే ఆగస్టు మొదటి వారంలోపు జలాశయం పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉందని ఆయకట్ట రైతులు చర్చించుకుంటున్నారు. తుంగభద్రకు పెద్ద ఎత్తున వరద తరలిరావడంతో బోరు బావుల కింద వరి, మిరప నార్లు వేసుకున్న ఆయకట్టు రైతులు ఆనందపడుతున్నారు. సకాలంలో ఆయకట్టుకు సాగునీరు విడుదల చేస్తారని ఆశాభావంతో ఉన్నారు.

చలసాని జీవితం అనుసరణీయం

వర్ధంతి సభలో వక్తలు

విశాలాంధ్ర - విశాఖ: ప్రజా ఉద్యమాలలో మార్క్సిస్టు మేధావి చలసాని ప్రసాద్ బలమైన ముద్రవేశారని వక్తలు కొనియాడారు. నాయకత్వం పద ప్రయోగాన్ని ఆయన అంగీకరించే వారు కాదనీ బాధ్యులు అనే పదాన్ని ప్రయోగించే వారని చెప్పారు. ఆయన జీవితం ఆచరణీయమన్నారు. మార్క్సిస్టు మేధావి చలసాని ప్రసాద్ ఎనిమిదవ వర్ధంతి సందర్భంగా పౌర ప్రజా సంఘాల వేదిక ఆదివారం విశాఖలో 'ఫాసిజం ముంచుకొస్తున్న సందర్భం' అనే అంశంపై సదస్సు నిర్వహించింది. ఈ సదస్సుకు పౌర, ప్రజాసంఘాల వేదిక సమన్వయకర్త పి. చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. వర్తమాన సందర్భం - చలసాని ప్రాసంగికత అంశంపై రచయిత్రి మల్లీశ్వరి మాట్లాడుతూ మహిళలను ఫాసిస్టు మూకలుగా తయారు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మతం మాయాజాలంలో వారిని ఉపయోగించుకుంటున్నారని, భక్తి ద్వారా వారిని ఫాసిజం వైపు నడిపిస్తున్నారని చెప్పారు. చలసాని రాజకీయ - సాహిత్య జీవితం అంశంపై విరసం నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ తూర్పు ప్రాంత ప్రజా ఉద్యమాల్లో చలసాని బలమైన ముద్రవేశారని అన్నారు. నాయకత్వం అనే పదాన్ని చలసాని వ్యతిరేకించే వారిని, ఆ పదంతో అధికారమనే భావజాలం వస్తుందని అభిప్రాయపడే వారని, బాధ్యులు అనే పదాన్ని ఉపయోగించేవారని చెప్పారు.

ఈ సదస్సులో భారతదేశ ప్రజాస్వామ్యం - భవిష్యత్తు అంశంపై మార్క్సిస్టు అధ్యయన కేంద్రం కన్వీనర్ జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజా ఉద్యమాలు రావాలని, దీనికి పౌర సమాజం ముందుకు రావాలని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యంపై తీవ్ర దాడి జరుగుతోందని అన్నారు. కర్నాటక ఎన్నికలతో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలమన్న విశ్వాసం ఏర్పడిందని చెప్పారు. అక్కడి పౌర సమాజం 140 నియోజకవర్గాల్లో క్రింది స్థాయిలో పనిచేసి బీజేపీ వ్యతిరేక ఓటు చీలకుండా కృషి చేసిందని తెలిపారు. ప్రశ్నించే స్వేచ్ఛ ప్రజాస్వామ్యంలో కీలకమైనదని, దాన్ని ప్రధాని మోదీ అంగీకరించకుండా.. అమెరికాలో జరిగిన విలేకరుల సమావేశంలో భారతదేశం గొప్ప ప్రజాస్వామిక దేశమని చెప్పడాన్ని ఖండించారు. ప్రశ్నించే వారిని వివిధ మార్గాల్లో అణిచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల కార్యకర్తలని నిర్బంధానికి గురి చేస్తున్నారని చెప్పారు. కోర్టులు ఈ విషయములో పాలకవర్గానికి సానుకూలంగా వ్యవహరించటం విచారకరమని అన్నారు. దేశంలో మీడియాని రిలయన్స్, అదానీలు తమ గుప్పెట్లో పెట్టుకున్నాయని తెలిపారు.

ఫాసిజం ముందుకొస్తున్న సందర్భం - చలసాని అంశంపై వీక్షణం సంపాదకుడు ఎన్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఫాసిజం ప్రమాదం గురించి 90 ల్లోనే చలసాని ప్రసాద్ మరోసారి గుర్తు చేశారని చెప్పారు. 20, 21 వ శతాబ్దాల ఫాసిజాన్ని చలసాని ప్రసాద్ ప్రత్యక్షంగా పరిశీలించారని అన్నారు. ఫాసిజాన్ని ఓడించేందుకు ఒక బృహత్తర కార్యక్రమాన్ని సిద్ధం చేయాలని అన్నారు. ఫాసిజం ఒక సాంస్కృతిక, రాజకీయ ఆచారంగా ముంచుకొస్తోందని, పాలకవర్గాల చేతుల్లో ఒక ఆయుధంగా ఉందని అన్నారు. ఫాసిజం అందరి ఆమోదంతో వస్తుందేమోనన్న ఆందోళన ఉందని చెప్పారు. మణిపూర్ లోని ఘటనలతో ఫాసిజం వికృత రూపం బయటపడిందని, అక్కడ ఫాసింజం పతాక స్థాయిలో కనిపించిందని అన్నారు.

బస్‌స్టాండ్ టాయిలెట్‌లో పసిగుడ్డు

అప్పుడే పుట్టిన బిడ్డను వదిలివెళ్లిన తల్లి

విశాలాంధ్ర-వినుకొండ: అప్పుడే పుట్టిన పసికందును ఆర్టీసీ బస్టాండ్ లోని టాయిలెట్ లో వదిలేసి వెళ్లిందో మహా తల్లి. పల్నాడు జిల్లా వినుకొండలో ఈ ఘటన శనివారం రాత్రి వెలుగుచూసింది. నవజాత శిశువును చూసిన స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి 10 గంటలకు ఆర్టీసీ డిపోలో హెల్పర్ గా విధులు నిర్వహిస్తున్న జనావత్ రవీంద్ర నాయక్ టాయిలెట్ లో బిడ్డ ఏడుపు వినిపించటంతో వెళ్లి చూడగా... నవజాత ఆడ శిశువు టాయిలెట్ బేసిన్ లో ఏడుస్తూ కనిపించింది. వెంటనే వినుకొండ పోలీసులకు సమాచారం ఇచ్చి స్థానిక మహిళల సహాయంతో శిశువును వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాప ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని పాపను పీడియాట్రిక్ సూపర్విజన్ లో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు డాక్టర్ రజాక్ తెలిపారు. సమాచారం తెలుసుకున్న వినుకొండ సీఐ సాంబశివరావు, ఎస్సై స్వర్ణలత ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని శిశువు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆర్టీసీ డిపోలో ఉన్న సీసీ ఫుటేజీల ఆధారంగా శిశువును ఆర్టీసీ టాయిలెట్‌లో వదిలి వెళ్లిన వారి ఆచూకీ కోసం విచారణ చేపడుతున్నారు.

గిరిజన హక్కుల సాధనకు పోరు

పీజే చంద్రశేఖర్ పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు: హక్కుల సాధనకు గిరిజనులందరూ ఐక్యమవుదామని మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర నాయకులు పీజే చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఆదివారం ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సమాఖ్య (ఏపీజీఎస్) ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఏపీజీఎస్ జిల్లా కన్వీనర్ దాసరి నాగరాజు అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన పీజే చంద్రశేఖర్ మాట్లాడుతూ అణగారిన గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల సాధనకు ఈ నెల 30,31 తేదీల్లో రాయచోటిలో నిర్వహించే ఏపీజీ ఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. పాలకులు ఇప్పటివరకు గిరిజనులను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారు తప్ప వారి సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి ఎక్కడా తోడ్పాటు నిచ్చిన దాఖలాలు లేవు అన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు ద్వారా గిరిజనులకు రావలసిన రాయితీలు అందటం లేదన్నారు. మైదాన ప్రాంత గిరిజనులు అటవీ ప్రాంత గిరిజనులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. పోలీసులు నుంచే కాకుండా పెత్తందారీ వర్గాల నుంచి దాడులు వేధింపులు పెరుగుతున్నా వాటిని అదుపు చేసే నాథుడే కరువయ్యారన్నారు. గిరిజనుల రక్షణ కోసం అనేక చట్టాలు పొందినా అవి అమలుకు నోచుకోవడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మనువాద సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చి గిరిజనులను మరింత అణగారిన వర్గాలుగా చూస్తూ మరింత చిన్న చూపు చూస్తున్నదన్నారు. భారత రాజ్యాంగం గిరిజనుల కోసం అనేక హక్కులు కల్పించిందని,అనేక చట్టాలను రూపొందించిందని తెలిపారు.అయితే వాటి అమలుకు ప్రతి గిరిజనుడు ఐక్యమై పోరాడాలని పీజే చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ," వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సమాఖ్య జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్లుగా దాసరి నాగరాజు, ఆర్ శేషారత్నం, సిహెచ్ అశోక్ మరో 15 మందితో నూతన కమిటీ ఎన్నికైంది.

మతోన్మాదాన్ని ప్రేరేపిస్తున్న బీజేపీ

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు విమర్శ

విశాలాంధ్ర- విజయవాడ(చిట్టినగర్): మణిపూర్ ఆరని మంటలకు కారణం కేంద్రంలో, ఆ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీనేననీ, ఆ పార్టీ అధికారంలో ఉండి మతోన్మాదాన్ని ప్రేరేపిస్తున్నదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ఓబులేసు ఆగ్రహం వ్యక్తంచేశారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి, మానభంగం చేసి చంపిన అరాచక మూకలను అరెస్టు చేయాలని, 160 మందిని పొట్టన పెట్టుకున్న మతోన్మాదులకు అండగా నిలిచిన బీజేపీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో రాష్ట్ర కార్యాలయం నుంచి పాదయాత్రగా గొల్లపూడి మైలురాయి సెంటర్‌కు చేరుకుని అక్కడ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ మణిపూర్ లో ఉన్నత వర్గమైన మయితేలకు, గిరిజన, ఆదివాసీల వర్గమైన కుకీలకు ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ వైరాన్ని సృష్టించారన్నారు. దేశంలో దుర్మార్గ పాలన అంతమొందించేందుకు దేశ పౌరులందరూ ఐక్యమవ్వాలని ఓబులేసు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ గిరిజన మహిళ అయిన రాష్ట్రపతి ముర్ము మణిపూర్ ఘటనలపై చర్యలు తీసుకోవాలని, మానవ మృగాలను ఉరితీయాలి అన్నారు. వ్యవస్థలన్నింటిని బీజేపీ తన గుప్పెట్లో పెట్టుకుంటోందన్నారు. వ్యవస్థల్ని, దేశాన్ని, కాపాడాలన్నారు.

సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సిహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ మనువాదాన్ని అమలు చేయటంతో, మణిపూర్ లో రెండు తెగల మధ్య జరిగిన దారుణ సంఘటనలు దేశంలో ప్రజలందరూ గమనిస్తు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడి అసోసి యేషన్ నాయకులు జె లలితమ్మ, సుగుణమ్మ, హెల్డా, హేమా తదితరులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ ఏమైంది?

సీఎంను నిలదీసిన వైఎఫ్ నేతలు

విశాలాంధ్ర- విజయవాడ: నిరుద్యోగులకు ఏటా జాబ్ క్యాలెండర్ ఇచ్చి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాట తప్పి మడమ తిప్పారని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు హామీ ఏమైందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర బాబు, నక్కి లెనిన్ బాబు ప్రశ్నించారు. స్థానిక దాసరి భవన్‌లో ఏఐవైఎఫ్ విజయవాడ నగర 25వ మహాసభ ఆదివారం నగర ఇన్‌చార్జ్ కార్యదర్శి బేవార శ్రీను అధ్యక్షతన జరిగింది. మహాసభ ప్రారంభ సూచికంగా ఏఐవైఎఫ్ మాజీ నాయకులు దోనేపూడి శంకర్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో రాజేంద్రబాబు, లెనిన్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన మోదీ మాట తప్పారని అన్నారు. అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు అయినా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వక పోగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముతూ అంబానీ, అదానిలకి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. 1959 మే 3న ఆవిర్భవించిన అఖిల భారత యువజన సమాఖ్య కార్యకర్తలుగా ప్రజా సమస్యలు, నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ముందుండి పోరాటం చేయాలని సమస్య ఎక్కడుంటే అక్కడ ఏఐవైఫ్ ఉంటుంది అనే పద్ధతిలో నాయకత్వం పనిచేయాలని పిలుపునిచ్చారు.

సీపీఐ ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ సెక్రటరీ దోనెపూడి శంకర్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ యువత దేశం యొక్క అభ్యున్నతి కోసం పోరాడాలనీ, సమస్యల పరిష్కారం కోసం మతోన్మాదానికి వ్యతిరేకంగా, కుల నిర్మూలన అంటరానితనం లంచగొండితనానికి వ్యతిరేకంగా ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగావున్న 2,35,794 పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానికంగా ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి స్థానిక సమస్యలపై యువత పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నగర అధ్యక్షులు షేక్ నజీర్ ఆలపించిన విప్లవ గేయాలు యువతలో ఉత్సాహాన్ని నింపాయి.

టీటీడీ నిర్వహణ ప్రపంచానికే దిక్సూచి

వారణాసిలోని అంతర్జాతీయ సమ్మేళనంలో ఈవో ధర్మారెడ్డి

విశాలాంధ్ర-తిరుమల: ఆలయ నిర్వహణలో తిరుమల తిరుపతి దేవస్థానములు(టీటీడీ) ప్రపంచానికే దిక్సూచి అని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అన్నారు. నిర్వాహకుల దృఢ నిశ్చయం, లక్ష్యం, చిత్తశుద్ధి, భక్తి దేవాలయాల పరిపాలన, అభివృద్ధికి దోహదమవుతాయన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలోని రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో అంతర్జాతీయ దేవాలయాల సమ్మేళనం రెండోరోజైన ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈవో హాజరయ్యారు. 30 దేశాలకు చెందిన వివిధ హిందూ దేవాలయాల నిర్వాహకులు 1600 మంది పాల్గొన్నారు. తిరుమలకు వచ్చే భక్తులకు టీటీడీ కల్పిస్తున్న వసతులు, ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు, ఆలయ నిర్వహణకు సంబంధించిన పాలనా వ్యవస్థపై ఈవో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ అందరి దృష్టిని ఆకర్షించింది. ధర్మారెడ్డి మాట్లాడుతూ భక్తలకు దైవదర్శనం, వసతి, తలనీలాలు, లడ్డూల తయారీ తదితర అంశాల్లో టీటీడీ అగ్రస్థానంలో ఉందన్నారు. ఆలయంలో పరిశుభ్రత పాటించాలని, భక్తులకు దర్శనం, వసతులు కల్పించాలని, సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్య, వైద్యం, అన్నదానం, వేద సంస్కృతి పరిరక్షణ చేపట్టాలన్నారు. టీటీడీ ఇలాంటివి చేస్తున్నట్లు తెలిపారు. స్విట్జర్లాండ్, సింగపూర్‌లాంటి దేశాల తరహాలో తిరుమలలో పారిశుద్ధ్యం ఉందన్నారు. పురాతన ఆలయాల పునరుద్ధరణకు, మతమార్పిడులను అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రాంతాల్లో నూతన ఆలయాల నిర్మాణం కోసం శ్రీవాణి ట్రస్టును ప్రారంభించామని తెలిపారు. ఇప్పటివరకు 170 పురాతన ఆలయాల పునరుద్ధరణకు ఆర్థిక సాయం చేశామని, 300 గుళ్లను నిర్మించామని, రెండువేల ఆలయాల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నట్లు చెప్పారు. శ్రీవాణి ట్రస్టుకు రూ.900కోట్ల విరాళాలను భక్తులు అందజేశారని, ఇప్పటివరకు రూ.330 కోట్లు ఖర్చు చేశామన్నారు. రూ.10వేలు ఇచ్చిన దాతలకు బ్రేక్ దర్శనం టికెట్ ఇస్తున్నామన్నారు. శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయం ఏడాదిన్నర కిందట ప్రారంభించామన్నారు. ఇప్పటివరకు 1600కు పైగా గుండె శస్త్రచికిత్సలు, నాలుగు గుండెమార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. పిల్లలకు కార్డియాలజీతోపాటు ఇతర విభాగాలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని డిసెంబరులో అందుబాటులోకి తెస్తామని చెప్పారు. టీటీడీ అధ్వర్యంలో 71 ఆలయాలు, 11 ట్రస్టులు, 14 ఆసుపత్రులు, 35 విద్యాసంస్థలు, తొమ్మిది వేద పాఠశాలలు, నాలుగు గోశాలలు, 300 కళ్యాణ మండపాలు, 10 ధార్మిక సంస్థలు, నాలుగు భాషల్లో శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్, అనాథల కోసం బాలమందిరం, రెండు మ్యూజియాలు ఉన్నాయన్నారు. శ్రీవారికి అలంకరించే ఆభరణాలలో 1.2 టన్నుల కేజీల బంగారం ఉంటే 10 టన్నుల వెండి వినియోగిస్తున్నట్లు తెలిపారు. రూ.17వేల కోట్ల నగదు, 11 టన్నుల బంగారాన్ని బ్యాంకుల్లో జమ చేసినట్లు వెల్లడించారు. శ్రీవారి అలంకరణకు ఏడాదికి 500 టన్నుల పుష్పాలు వాడతామన్నారు. టీటీడీలో 24500 మంది ఉద్యోగులు ఉండగా, రోజుకి 800 మంది విధులలో ఉంటారన్నారు. ప్రసాదాల తయారీకి ఏడాదికి 5000 టన్నుల నెయ్యి వినియోగిస్తామన్నారు. టీటీడీ పరిధిలో 6000 ఎకరాల అటవీ ప్రాంతం ఉందన్నారు. 2000లో శ్రీవారి సేవ విభాగాన్ని ప్రారంభించామని, ఇప్పటివరకు 14 లక్షల మంది సేవకులు సమోదయ్యారని తెలిపారు. ఇతర ఆలయాలు కూడా శ్రీవారి సేవ వ్యవస్థను ప్రారంభించాలని సూచించారు. నైవేద్యం కోసం రసాయనాలు, పురుగుమందులు లేని గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగిస్తున్నామని తెలిపారు. కోవిడ్ విజృంభించినప్పటి నుంచి శ్రీనివాస కళ్యాణం, వెంకటేశ్వర వైభవోత్సవాలు, గుడికో గోమాత కార్యక్రమం, విషూచిక మహామంత్రంతో పారాయణాలు ప్రపంచ భక్తుల దృష్టిని ఎలా ఆకర్షించాయో వివరించారు. అంతకుముందు ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు మోహన్ భగవత్ మాట్లాడుతూ శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో వెనుకబడిన ప్రాంతాల్లో నూతన ఆలయాల నిర్మాణం, శిథిలావస్థలో ఉన్న ఆలయాల పునరుద్ధరణను పెద్దఎత్తున చేపట్టినందుకు టీటీడీని ప్రశంసించారు. టీటీడీ ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలపై ప్రశంసలు కురిపించారు. అనంతరం ఈవో ధర్మారెడ్డిని సమ్మేళనం చైర్మన్ ప్రసాద్ మినేశ్‌లాడ్, టెంపుల్స్ కనెక్ట్ వ్యవస్థాపకులు గిరీశ్ కులకర్ణి శాలువా, మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో చెన్నై సలహా మండలి అధ్యక్షులు శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర నిధుల పక్కదారి

జగన్ సర్కారుపై పురంధేశ్వరి విమర్శ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: దేశ ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలన సాగిస్తు న్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి పేర్కొన్నారు. వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరులోని రాయల్ కౌంటీలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో సాగుతున్నదన్నారు. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం కోసం సబ్ కా సాత్-సబ్ కా వికాస్ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. పేదరికం తెలిసిన వచ్చిన ప్రధాని మోదీకి పేదల కష్టాలు తెలుసు కాబట్టే దేశంలోని పేదలకోసం సంక్షేమాన్ని అందిస్తున్నారని తెలిపారు. ఏపీ అభివృద్ధికి సంపూర్ణంగా మద్దతు అందిస్తూ రెవెన్యూలోటు, ప్రాజెక్టుల నిర్మాణం, అన్ని విధాలుగా ఆర్థిక సహకారం అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 22లక్షల మంది పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ఒక్కొక్క ఇంటికి రూ.1లక్ష 80వేల నిధులను మంజూరు చేసినప్పటికి రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. కేంద్రం ఇస్తున్న నిధులను సైతం పక్కదారి పట్టిస్తున్నదని విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్న ఆశయంతో 14, 15వ ఆర్థిక సంఘం నిధులను మంజూరు చేస్తే... అభివృద్ధిని పక్కన పెట్టి కేంద్రం ఇచ్చిన నిధులను సైతం స్వాహా చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. నిధులు మంజూరు చేయకుండా సర్పంచ్‌ల వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. వెనుకబడిన రాయలసీమను అభివృద్ధి చేయాలన్న ఆలోచన ఈ ప్రాంతానికే చెందిన ముఖ్యమంత్రి జగన్‌కు లేకపోవడం దురదృష్టకరం అన్నారు. జగన్ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. కేంద్రం సహకారం లేకుండా కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపడతామన్న జగన్ మాటలు నీటి మాటలయ్యాయన్నారు. పరిశ్రమలు లేక నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేయాలన్న ఆశయం ఒక్క బీజేపీకే ఉందన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేయడమే అధిష్టానం ఆలోచనని చెప్పారు.

మన్ననూరులో 800 ఏళ్ల నాటి రాతి క్వారీలు



హైదరాబాద్: శ్రీశైలం వెళ్లే రహదారిలో మన్ననూరు ఘాట్ రోడ్ ప్రారంభంలో, కళ్యాణ చాళుక్యుల కాలంనాటి రాతి క్వారీలను గుర్తించినట్లు పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డా. ఈమని శివనాగిరెడ్డి వెల్లడించారు. వారసత్వ స్థావరాలను గుర్తించి... వాటిని కాపాడుకోవడానికి స్థానికులకు అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా అయన ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా, మన్ననూరు పరిసరల్లోని ప్రతాపరుద్రుని కోట వద్ద రోడ్డు కుడి (ఉమామహేశ్వరం) వైపున రాతిని తొలచిన ఆనవాళ్లను గుర్తించారు. సమీపంలోని రాతి తోరణం, కోట గోడలు కట్టడానికి ఈ రాతినే వాడి ఉంటారని చెప్పారు. పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలోని పర్వత ప్రకరణంలో ప్రస్తావించిన శివపుర ద్వారం ఈ తోరణమేనని ఈ ప్రాంతం పై విస్తృతంగా పరిశధనలు చేసిన చరిత్రకారుడు డా. ద్యావనపల్లి సత్యనారాయణ తెలిపారని, తద్వారా ఈ రాతి క్వారీలు క్రీ.శ. 12వ శతాబ్దానికి చెందినవని స్పష్టమవుతోందని శివనాగిరెడ్డి అన్నారు. చారిత్రక ప్రాధాన్యత గల ఈ రాతి క్వారీలను, తోరణ ద్వారాన్ని, ప్రతాపరుద్రుని కోటను కాపాడుకోవడం ద్వారా శ్రీశైలం వెళ్లే పర్యాటకులను ఆకర్షించే విధంగా పరిసరాలను సౌకర్యాలతో అభివృద్ధి పరచాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పశువుల పెంపకందార్లపై నిర్లక్ష్యం తగదు

విశాలాంధ్ర-విజయవాడ గొర్రెల, మేకల పెంపకం దార్ల సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యన్ని వీడాలని చేతి వృత్తి దారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామాంజనేయులు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. విజయవాడ దాసరి భవన్‌లో ఆదివారం ఏపీ గొర్రెల, మేకల పెంపకం దార్ల సంఘం సమావేశం రాష్ట్ర కో -కన్వీనర్ చింతల కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న కె. రామాంజనేయులు, పి. జమలయ్యలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ఉత్పత్తి రంగం లో గ్రామీణ ప్రాంతాల్లో ప్రధానంగా జీవిస్తున్న గొర్రెల, మేకల పెంపకం దార్ల సమస్యలపై పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, తమ సమస్యల పరిష్కా రం కోసం ఉద్యమాల ద్వారా సాధించుకోవాలని తెలిపారు. ఏపీ గొర్రెల, మేకల పెంపకం దార్ల సంఘం రాష్ట్ర కన్వీనర్ కోట్ల పోతులయ్య మాట్లాడుతూ వై ఎస్సార్ పశు నష్ట పరిహార పథకం క్రింద చెల్లించాల్సిన రూ. 250కోట్లు, పశుభీమా పథకం క్రింద రైతులవాటా 200కోట్లు రూపాయలను రైతులు ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్‌సీడీసీ పథకం క్రిందరాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీ నిధులను 2020 నుండి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న నిధులు కేటాయించి పెంపకం దార్లకు రుణాలు అందజేయాలని కోరారు. గొర్రెలకు, మేకలకు సంవత్సరానికి 3సార్లు నట్టల మందులు వేస్తామని ఇచ్చిన హామీని పూర్తిగా అమలు చేయాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో గొర్రెల, మేకల పెంపకం దార్ల ఫేడరేషన్ తక్షణమే నిధులు కేటాయించాలని, గొర్రెల, మేకల పెంపకం దార్ల గ్రామ స్థాయి సొసైటీలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నూతనంగా ఏర్పడిన జిల్లాల వారీగా సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి నూతన పాలక వర్గాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా యూనియన్‌లకు రాజకీయ నిరుద్యోగులను చైర్మన్‌లుగా నామినేట్ చేయకుండా ఎన్నికల ద్వారానే చైర్మన్‌లను ఎన్నుకోవాలని డిమాండ్ చేస్తూ అన్ని జిల్లాల్లో సదస్సులను నిర్వహించాలని సమావేశం నిర్ణయం తీసుకుంది. ఈ సదస్సులకు గొర్రెల, మేకల పెంపకం దార్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు.

ఏఓబీలో 28 నుంచి మావోయిస్టు సంస్మరణ సభలు

విశాలాంధ్రబ్యూరో- పాడేరు: మావోయిస్టు పార్టీ ఆంధ్ర-ఒడిశా బార్డర్ స్పెషల్ జోనల్ కమిటీ అధ్వర్యంలో ఈనెల 28వ తేదీ నుంచి ఆగస్టు 3 వరకు విప్లవోద్యమంలో అమరులైన విప్లవకారుల స్మారకార్థం సంస్మరణ సభలు జరుపుతున్నట్టు జోనల్ కమిటీ కార్యదర్శి గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలోని ఆర్ఎస్ఎస్ -బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను పూర్తిగా ప్రైవేటీకరిస్తూ... వాటిని బహుళజాతి కార్పొరేట్ సంస్థలకూ, ఆదానీ, అంబానీ లాంటి దళారీ నిరంకుశ పెట్టుబడిదారులకు అమ్మివేస్తోందని పేర్కొన్నారు. 'ఒకేదేశం', 'ఒకే మతం' అనే లక్ష్యాన్ని సాధించడానికి 'ఉమ్మడి పౌరస్మృతి'ని పార్లమెంటులో చట్టంగా తేవాలని చూస్తున్నారని, ఒడిశాలోని నవీన్ పట్నాయక్, ఏపీలోని జగన్ ప్రభుత్వాలు కేంద్ర విధానాలను అమలు చేస్తూ విప్లవోద్యమంపై పోరాడే ప్రజలపై, ప్రశ్నించే గొంతుకలపై, లౌకికవాదులపై, మైనార్టీలపై ఉపా, రాజద్రోహనేరం లాంటి నల్ల చట్టాలను మోపి జైళ్లల్లో నిర్బంధిస్తున్నాయని విమర్శించారు. మావోయిస్టు అమరుల త్యాగాలకు నిజమైన నివాళిగా 28 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు నిర్వహించనున్న మావోయిస్టు అమరుల సంస్మరణ సభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మండుతున్న మణిపూర్

ఒకానొకనాడు పచ్చదనం, ప్రశాంత వాతావరణంలో ఆహ్లాదకరంగా ఉన్న మణిపూర్ నేడు దుష్ట రాజకీయాల మంటల్లో చిక్కుకొని ప్రజలు విలవిలలాడుతున్నారు. పాలకుల నిర్లక్ష్యం, వారి స్వార్థప్రయోజనాలకోసం ప్రజలు బలి అవుతున్నారు. ఆ రాష్ట్రంలో రేగిన కల్లోలానికి స్పందించిన రచయితలు తమ భావాన్ని కవితల రూపంలో వ్యక్తం చేశారు.

మరో విషాద భారతం

మణిపూర్ మారణహోమంలో
ఆడపడుచుల మాన ప్రాణాల
నగ్నదేహాలు ఊరేగుతున్నాయి
ఉన్మాదుల అకృత్యాలకు బలవుతున్నాయి
దుశ్శాసన వారసుల అత్యాచారాలకు
అవమాన భారంతో భరతమాత
శిరస్సును వేలాడేసింది
నాడు ద్రౌపది మాన సంరక్షణకు
ఉరుకులుపెట్టిన శ్రీకృష్ణుడు ఏడీ నేడు ?
ఒక్కడంటే ఒక్కడు లేడేని
హస్తినాపుర రాజ మందిరాలపై
తనకుతాను అవనతమయ్యింది
సిగ్గుతో జాతీయ పతాక
ఆధునిక ప్రభువుల రాజధర్మానికి
అశోకుని ధర్మచక్రం తునాతునకలయ్యింది
బంకించంద్ర బాబు వందేమాతర గీతం
విషాద రాగాన్ని ధ్వనిస్తోంది
నాగరిక ప్రపంచం ముందు
తలదించుకుంది నాదేశం నేడు

- కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీ

సాహితి

నిర్మూలన

శాంతిశ్రీ

ఇక్కడ మాన, ప్రాణ రక్షణలుండవు..
మూకలే ఇప్పుడక్కడ రాజ్యమేలుతున్నాయి..
వాళ్ళకు చలనం ఉండదు.. భీతి అసలే ఉండదు..
నిర్మూలనే వాళ్ళ ఎజెండా..

అక్కడ జరుగుతున్నది
శాంతిభద్రతలకు భంగం కాదు..
మతపరమైన మారణహోమం..
పాలకుల పన్నాగాలతో సాగే ఉన్మాదకాండ..
చట్టాలతో వీలుకానప్పుడు ..
అంతర్యుద్ధమే వారి ఆయుధం..

గుజరాత్ మోడల్ ఇప్పుడు..
మణిపూర్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్..
ఆడ (అడవి) బిడ్డలను నగ్నంగా తరుముతున్న దృశ్యాలు..
హత్యాచారాలు.. పైశాచిక కృత్యాలు..
ఒక్క ఆదివాసీ లేకుండా తరిమికొడుతున్న దారుణాలు.

రెండు ఇంజన్ల ముఖాలు.. బుల్డోజర్ రాజకీయాలు..
ఇప్పుడక్కడ ఒక్క ఘటన కాదు..
వందల్లో అన్నది వారి మాటే..
అది వేలల్లో జరిగినా ఆశ్చర్యం లేదు..
జాతి నిర్మూలనే వారి ఎత్తుగడ..

మోయితీలు ముసుగులే..
వెనుక అసలు ముఖాలే నాటకం ఆడేది..
అబద్ధాలే వినిపిస్తాయి అక్కడ..
79రోజులకు మౌనం అరనిమిషమే శబ్దంచేసింది..
అది కేవలం తడిలేని పొడి మాటలు..

అక్కడ భూములే వారికి కావాల్సింది..
గంజాయి సాగుదారులంటారు.. వలసదారులంటారు..
పేర్లు ఎన్ని పెట్టినా వారిని లేకుండా చేయడమే వారి లక్ష్యం..
ప్రపంచం కన్ను మూయాలనుకోవడం అవివేకం..
ప్రజలది ఎప్పుడూ మూడో కన్ను..

దిగంబర రచన

అనుక్షణం సర్కస్ పెద్దపులితో
గారడీ చేసే లేడీరింగ్ మాస్టర్స్ మేము
మేము ఆ పెద్దపులిని భయపెడితే
మీరు మౌనంగా చూస్తారు
అదే పెద్దపులి మమ్మల్ని నోట కరుచుకుంటే
మీరు చప్పట్లు కొడతారు
యేమీ మారని నీయాండె ర్తల్ హోమోసెపియన్స్!
మీ అసలు స్వరూపాన్ని మేము
నగ్నంగా పదేపదే చూస్తూనే వున్నాము

కృతజ్ఞతలు
మీరు మాతో చేయించిన నగ్నకవాతుకి కృతజ్ఞతలు
మమ్మల్ని మీరు నగ్నంగా
గుర్తు పెట్టుకున్నందుకు కృతజ్ఞతలు

మేం యెప్పటికీ గుర్తుంచుకుంటాం

మా నగ్నదేహాల భుజాల మీద నుండి భవిష్యత్ కోసం
మీరు దూసే చిత్ర హింసల బాణాలని
మేము లెక్కతప్పకుండా గుర్తుంచుకుంటాం

మిమ్మల్ని మేం యెప్పుడూ మర్చిపోలేదు
యిప్పుడైతే అస్సలు యెప్పటికీ
అదాటున కూడా మర్చిపోమ్

యెప్పటికీ మర్చిపోము
యీ నగ్నచిత్రాన్ని యెప్పటికీ మర్చిపోము
మీ బతుకంతా మా నగ్నదేహాల నెత్తురుతో
చేసిన సంతకాల సోకాల్డ్ విజయాలే
అరేయ్ యెన్ని యేళ్ళు అయినా
మీమీ ప్రతీకారాలకి
మా శరీరమే కదరా యుద్ధభూమి!

అవును మాకున్నది వొకే ఆయుధం
వొకే వొక్క శరీరం
ఆచ్ఛాదితమయినా అనాచ్ఛాదితమయినా
శరీరమొక్కటే!

-కుప్పిలి పద్మ

విజయ చిహ్నాలు

అయ్యో, నా ప్రియమైన కుకి తల్లులారా,
మన దేహాలు యుద్ధ క్షేత్రాలు
మగవాళ్లు నీళ్ల సీసా కోసం
కొట్లాడుకున్నా సరే
మొట్టమొదట తిట్టేది
మననూ మన అమ్మలనే.
నీ తల్లిని నీ చెల్లిని...
అవే అన్నిటికన్న ఎక్కువగా
వాడే తిట్లు!

మనను ఊరేగిస్తారు
బట్టలూడదీస్తారు
అత్యాచారం చేస్తారు
రక్కుతారు కొరుకుతారు
చితకబొడుస్తారు
మనం భారతమాత బిడ్డలం గదా...
మన దేహాలే
వారి విజయ పతకాలు.

ఇది
ఎల్లప్పుడూ ఇలాగే ఉంది
మన దేహాల మీద
మగవాళ్లు యుద్ధం చేసుకుంటారు
మన రొమ్ములను వాళ్లు తగులబెడతారు
మనను యుద్ధ బాధితులుగా పిలుస్తారు

అయ్యో, నా కుకి తల్లీ,
మగవాళ్లు యుద్ధం ఆట ఆడుకుని
యుద్ధరంగం మీదనో
పొదలలోనో విందులు కుడిచి
మన దేహాలు వదిలిపోతారు

ఈ పురుష దేశంలో
మనను చిందరవందర చేయడానికి
రెండు వేళ్లతో విజయచిహ్నాలు చూపుతూ
మనను ఊరేగించడానికి
మనకు వాళ్లు ఎన్నెన్నో పేర్లు పెట్టారు...

(పశ్చిమ బెంగాల్‌కు చెందిన మౌమితా ఆలం ఇంగ్లీష్‌లో కవిత్వం రాస్తారు. ఆమె కవితా సంపుటం ది మ్యూజింగ్స్ ఆఫ్ ది డార్క్ 2020లో వెలువడింది. ఈ కవిత ఔట్ లుక్ పత్రికలో అచ్చయింది.)

-మౌమితా ఆలం, తెలుగు: ఎన్ వేణుగోపాల్

అనాగరిక బర్బరత్వం

నగ్నమయింది
ఆమె కాదు
మీ అనాగరిక
బర్బరత్వం-

సిగ్గు పడాల్సిందీ
ఆమె కాదు
నేరపూరిత

మౌనప్రభుత్వం
హత్యకు గురయిందీ
ఆమె కాదు
నిలువలేకపోయిన
మానవత్వం

కాలి బూడిదయిందీ
ఆమె కాదు
వ్యవస్థ చుట్టుకున్న
వస్త్రం!

-కే. ఆనందాచారి

ఓరి భగ..వంతుడా!

అప్పుడు
వాడూ మరొకడు
తనను మట్టి మీద
వెల్లకిలా పడ దోసి
రేప్ చేద్దామా అంతకన్న ఘోరం
ఇంకేమయినా చేద్దామా అని
తీరిగ్గా మాట్లాడుకునే మాటలు వింటూ
అప్పుడు
ఆ అమ్మాయి
ఏమనుకుని ఉంటుంది?

ఉట్టి గాయం అయితే
బాగున్ను అది నిత్య
పరిచితమే
ఆత్మ మీద
పదే పదే
మృగ ఖడ్గాల దాడి
లేదు ఎంత పల్చనిదయినా
ఉల్లిపొర వంటిదైనా, డాలు

మాంసం ముద్దలైన
నాన్న కోసం,
అన్న కోసం ఏడుస్తుందా
త్రిశూలానికి గుచ్చి
ఎత్తబడే తన
మర్మావయావాన్ని
కప్పడానికి
చాచలేపోయిన చేతుల
నిస్సహాయతను నిందిస్తుందా

అప్పుడు ఆ అమ్మాయి ఏమి
ఆలోచించి ఉంటుంది?
చివరాఖరి ఊపిరితో
ఏ దేశాన్ని ఎలా
శపించి ఉంటుంది?
ఏ తెగను ఎలా
అసహ్యించుకుని ఉంటుంది?

ఓరి భగ...వంతుడా
నీకూ ఉందట కదా భగం
నిన్నెప్పుడైనా అలా వాళ్లు
మానభంగం చేశార్రా

నీకు తెలుసట్రా
ఆ గాయం నొప్పి?

-హెచ్చార్కే

నిజాన్ని నగ్నంగా నిలబెట్టాలి...

ఒక్కొక్కరు నగ్నం అవుతుంటారు
ఏ నినాదం నిన్ను బరిబాత చేస్తుందో తెలీదు
ఆడతనం అంటే మోడు బారిన జీవితం అని తెలుసు ,
శరీరాన్ని కోరే జనాలున్నారని అవగతం అయింది కానీ
మానవత్వాన్ని అమ్మేసి.....
కీచక పర్వాన్ని వెంటబెట్టుకొని ఇలా
ఎన్ని కాలాలు మరెన్ని కలాలు పదును పెట్టినా
ఈ దాష్టీకానికి బలైన మహిళల మానాన్ని తిరిగి తెస్తామా
ఏ నవసమాజాన్ని ఆహ్వానించలేని మనం
ఏలినవారిని ఆకాశానికి సంకేతం చేసే మనం
నాలుగు మాటలు పోగుపెట్టి
నానా రచ్చను రచ్చబండను చేసి ప్రతి సెల్ఫోన్లో ఊదే మనం
ఇలాంటి ఘోరమైన సంఘటనలకు ఘోరీ ఎందుకు కట్టలేము
కులం మతం ప్రాంతంతో రాజ్యం ఆడే ఆటలో ఆడదేపావుగా మారడం
మానాన్ని అంగట్లో సరుకు చేయడం...
దేశమా ఎటుపోతోంది నాగరికత.....
రంగు ఏదైనా /సమాజంలో రాజకీయం ఒక తిరునాలే
తప్పిపోయింది ఆడదాని రక్షణే...
సామ్రాజ్యమా ఎందుకింత చిన్నచూపు మాపై
అసంపూర్ణ వాక్యాలతో
అర్థంకాని స్తితుల్లో ఆడదాన్నీ అంధకారంలోకి నెట్టేస్తున్నా
ఇంకా ఇంకా దేశ చరిత్రలో
ఆడది ఒక భరత మాత అంటే నమ్మే పిచ్చి మాలోకాలం మేము
మానం మాదికాదని/ప్రాణం ఉందని ఊరుకునే రోజులు పోయాయి
మౌనం తరువాత స్వరం ఎలా ఉంటుందో ఊహించండి
ఎన్ని రాతలు/మరెన్ని పాళీలు కలగలసిన
ఇలాంటి ఆకృత్యాన్ని చెరపలేవు
చేయాల్సిందల్లా
నగ్నంగా ఊరేగిస్తూ /లైంగిక దాడికి పురికొలుపున్న రాక్షస జాతికి
నిరసనగా ప్రతి అక్క చెల్లి ఉద్యమమై ఊరేగాలి
మహోజ్వలితమై చెలరేగాలి...

- సుభాషిణి తోట



కదులు

కాలు కదపలేని వేళ
కలాన్నైనా కదుపు
కనీసం కాగితాన్నైన
కప్పుదం
ఈ దేశ దిశమొలపైనా

- కీర్తి ఇనుగుర్తి

ఒంటి కన్ను రాజు

మాట ఏది ఇప్పుడు
ఉగ్రూతలూగిస్తలేదు
బహుశా నీ భక్తులను కూడ.!

చుట్టరికం లేకితనం లోకం అంతా వీక్షించాక
విశ్వగురువు ముఖం ఎంత అలంకరించినా
వికృతం అంతా బహిరంగమే.!

పదిలక్షల సూటు కింద
చాతి సొట్ట స్పష్టంగా తెలుస్తుంది.!

మనిషి ఎంత పాతాలానికి పడిపోయాడు
తన మీద తానే ఉచ్చపోసుకుని రొచ్చుగుంటలో బొర్లుతున్న రోగిలా.!
తన జన్మస్థానాన్ని తానే నగ్నంగా
ఊరేగించుకునే ఉన్మాదిలా.!

ఓ ఒంటి కన్ను రాజా
నీ రాజ్యం గుడ్డి కండ్ల ప్రజా.!
పీనుగుల సంత.!

ఎక్కిచ్చిన మత్తు వదులుతుంటే
మెదళ్లు ఎంతలా కలిషితం అయ్యాయో.!
ఇంటిని ఎంత పెంట పెంట చేశావో.!
మసక మసకగా కనబడుతుంది

పురిటి నొప్పులు మొదలైనయి
తల్లి కడుపులకెల్లి మళ్లా తేటగా బయటకస్తం.!
మెల్లమెల్లగా తెల్లారుతుంది
పచ్చని అడవి ఆవరిస్తుంది.!

మైదానమంతా "మను"షులతో
నిండుకుంది మరి.!

-చిలువేరు అశోక్

భారతావని సిగ్గుపడుతోంది

భారతావని సిగ్గుపడుతోంది
తల్లి, చెల్లి, బిడ్డలపై మనువాదుల హత్యాచారాలు
ఆగడాలు, అకృత్యాల పై, పాలకుల మౌనం చూస్తూ...
భారతావని సిగ్గుపడుతోంది
మణిపూర్‌లో మంటలు రేపుతున్న
జాతి విద్వేషాలు రెచ్చగొడుతున్న
ప్రజాస్వామాన్ని మంటగలుపుతున్న నేతల తీరు చూసి...
భారతావని సిగ్గుపడుతోంది
గుజరాత్ మత విద్వేషాలు
మణిపూర్ మహిళల పై మారణకాండ
లఖింపూర్ రైతన్నల హత్యాకాండలను చూసి.........
భారతావని సిగ్గుపడుతోంది
విదేశీ పీడనకు చరమగీతం పాడిన
బాపూజీని చంపిన మతవాది
గాడ్సేకు గుడి కట్టిన దేశభక్తిని చూసి...
భారతావని సిగ్గుపడుతోంది
దళిత, గిరిజన దేశాధ్యక్షులను
దేవుని గుడి, ప్రజల గుడి (పార్లమెంటు)ల
దరిచేరనియ్యని ప్రధాన నేత తీరు చూసి...
భారతావని సిగ్గుపడుతోంది
బ్యాంకులు, ప్రజల సొమ్మును దోచిన
స్వరాష్ట్రీయులు విదేశాల్లో కులుకుతుంటే
కళ్ళుండి చూడలేని అభినవ ధృతరాష్ట్రుని తీరు చూసి...
భరతమాత బిడ్డలారా !
మానవత్వాన్ని మంటగలుపుతున్న..
ప్రజాస్వామ్యాన్ని పాతరేస్తున్న..
మోడీ, షాల నిరంకుశత్వాన్ని ప్రశ్నిద్దాం..రండి! కదిలిరండి !!

- కె.వి.వి. ప్రసాద్, ప్రధాన కార్యదర్శి, రైతుసంఘం

సిగ్గు బిళ్ళ కావాలి

విశ్వ గురువు హోదా వద్దు
వందే భారత్ ప్రయాణమొద్దు
చంద్రయాన్ ఖ్యాతీ వద్దు
సబ్ కా సాత్ సబ్ కా
వికాస్ నినాదాలొద్దు

మన్ కీ బాత్ ప్రవచనాలొద్దు
ఇంక్లూజీవ్ గ్రోత్ వ్యూహాలొద్దు
బేటీ బచావో బేటీ పఢావో పథకాలొద్దు
మేరీ ప్యారీ బాహేనో మాట లొద్దు

మనిషి మీద మనిషి
మూత్రం పోయకూడదనే
జ్ఞానం మిచ్చే కరికులం కావాలి
ఈ దేశం మానం కాపాడటానికి
ఒక సిగ్గు బిళ్ల కావాలి

- వంశీ కృష్ణ

ప్రజావాణి

భారతంలోని అమ్మాయి !?
నవభారతంలోని అమ్మాయి ..!
నాటి దుశ్శాసనుడి చేతిలోని ద్రౌపది..!
బయటకు వెళ్ళితే భద్రత లేదు..?
గడపదాటితే రక్షణ కరువు..?
కట్టెదుటే ... దుష్టశక్తులు..
శీలవతుల మానాలను హరిస్తున్నా..
నగరపౌరులు ప్రాణాలను తీస్తున్నా..
పాలకులు ప్రేక్షకపాత్ర వహిస్తారు ..!?
బాధితులు పేదవారయితే...
నిందితులువారి వర్గమయితే ...
తక్షణచర్యలువుండవు..?
కంటి తుడుపు కరెన్సీనోట్లు మాటలుంటాయి!?
ఈ దేశంలో అంబేద్కర్‌రాజ్యాంగం అమలుకావడంలేదు..?
స్టేషన్లో పోరచట్టాలు పనిచేయడం లేదు..?
ఎవరికి చెప్పుకోవాలి పేదవాడు..?
ఎవరు వింటారు బాధితుల గోడు..???

(మణిపూర్‌లో జరిగిన సంఘటనకు స్పందించి)

జి. సూర్యనారాయణ

మీరేం చేస్తున్నారు

వాళ్ళు సరే
నీచులే దుర్మార్గులే క్రూరులే
మీరేం చేస్తున్నారు

వాళ్ళు సరే/అహంకారులే అభిజాత్యులే
అచ్చోసిన రేపిష్టులే/అధికారిక పాపిష్టులే
మీరేం చేస్తున్నారు

దృశ్యం రంజుగా ఉందనుకున్నారా
బొమ్మ భలే బాగుందనుకున్నారా
ఉత్తమ ప్రేక్షక అవార్డు అందుకుందామనుకున్నారా
ఆ తల్లుల నిస్సహాయతలో
మీకు నవరసాలు కనపడ్డాయా
ఆమెల కన్నీళ్లలో మీకు/వేదన తడి తగల్లేదా
మీ ధైర్యనరం కరగడానికి
ఆ నగ్నత్వపు వేడి సరిపోలేదా
మీరేం చేస్తున్నారు

ఏమో... అనుమానమే
సొల్లు కార్చుకునే ఉంటారు
గుటకలు మింగే ఉంటారు
పెదాలు తడుపుకునేఉంటారు
మనసులో లోపలత్రిబులెక్స్ చప్పట్లు కొట్టే ఉంటారు
మనసులోలోపలజి
తీన్మార్ ఈలలు కూడా వేసే ఉంటారు

వాళ్ళు సరే/ఇంతకన్నా మీరేం చేసారు

మీ తలా ఒక చేయి చాలు కదా
వాళ్ళనాపడానికి
మీ తర్జని చాలుకదా
వాళ్ళు భయపడడానికి
మీ ఉమ్మడి కేక చాలదా
వాళ్ళ గుండెలు అవిసిపోవడానికి
మీరు ఖాండ్రించిన
ఉమ్మి చాలుకదా
వాళ్ళు కొట్టుకుపోవడానికి

వాళ్లంతే../మరి మీరేమిటి

తరవాత ఓ ట్వీట్ పడేద్దాంలే
అనుకుని ఉంటారు
తరవాత ఓ లైక్ కొడదాం లే
అనుకుని కూడా ఉంటారు
వీలైతే ఓ విషాద గీతం రాద్దాం
అనుకునే ఉంటారు
కొవ్వొత్తులకు ఆన్లైన్లో
ఆర్డర్ చేసే ఉంటారు
మౌన కవాతుకు
పోలీసుల అనుమతికి
దరఖాస్తు పెట్టే ఉంటారు

వాళ్లు అదే/ఇంతకన్నా మీరేం చేసారు

కాపాడాలి నా దేశాన్ని
మీ మౌనుల గుంపునుంచి
కాపాడాలి నా దేశాన్ని
మీ నిస్సిగ్గు నిన్కంపూప్‌ల నుంచి

వాళ్ళంతే
ఉచ్చలు పోస్తారు
చెప్పులు నాకిస్తారు
మలం తినిపిస్తారు
మీరేం చేస్తున్నారు

ఆమెలకు లేనివి దుస్తులే
మీకు లేనివి సిగ్గు లజ్జా
ఆమెలవి నగ్న దేహాలు
మీవి బరిబాత ఆత్మలు
మీ ప్రేక్షకత్వమే వాళ్ల అరాచకత్వం
మీ మౌనమే వాళ్ల దౌర్జన్యం
మౌన ప్రేక్షకులే నిజ ద్రోహులు కదా
నిశ్శబ్ద నిర్లిప్తతే/నెత్తుటి బురద కత్తుల వరద కదా
వాళ్ళు సరే/వ్యవస్థ సృష్టించిన రాబందులు
మీరు/జన్మత చీడపురుగులు/చచ్చిపోండి !
కొత్త జాతి
రవ్వంత చీము నెత్తురుతో/పుట్టకపోదు!

(మణిపూర్ పరేడ్ ప్రేక్షకులకోసం)

-ప్రసేన్

మణిపూర్ ఘోష పట్టదా?

- ప్రధాని తక్షణమే జోక్యం చేసుకోవాలి
- సీఎం తప్పు ఒప్పుకొని క్షమాపణ చెప్పాలి
- ఇరోమ్ షర్మిల డిమాండ్

మణిపూర్‌లోని చురాచాంద్‌పూర్‌లో ఇండిజీనియస్ ట్రైబల్ లీడర్స్ ఫోరం మహిళా సభ్యుల నిరసన ప్రదర్శన

కోల్‌కతా: మణిపూర్ ఘోష ప్రధానికి వినిపించడం లేదా అని పౌరహక్కుల కార్యకర్త ఇరోమ్ షర్మిల ప్రశ్నించారు. గుజరాత్ ప్రజల్లా మణిపూరీలకు నాయకత్వం అవసరం ఉందని, ప్రధాని తక్షణమే జోక్యం చేసుకొని ఈశాన్య రాష్ట్రంలో పరిస్థితులను చక్కబెట్టాలని 51 ఏళ్ల షర్మిల డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ తన వైఫల్యాన్ని అంగీకరించి, ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. మే 4న ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించడం అమానవీయమన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని, పెరోల్ లేని జీవితఖైదు విధించాలని డిమాండ్ చేశారు. కాంగ్‌పోక్పి జిల్లాలో మహిళల వీడియో చూశాక తనకు కన్నీళ్లు ఆగలేదని అన్నారు. ఈ వీడియో జులై 19న వెలుగులోకి రాగా దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తమైంది. సుప్రీంకోర్టు సైతం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు మొట్టికాయలు వేయడంతో దాదాపు 80రోజులకు ప్రధాని మోదీ నోరు విప్పారు. అమానవీయ ఘటనను ఖండించారు. మణిపూర్‌లోని బీజేపీ ప్రభుత్వం కూడా స్పందించింది. ఈ క్రమంలో ఆరుగురిని ఆ రాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. తాజా ఘటన నేపథ్యంలో బెంగళూరు నుంచి పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇరోమ్ షర్మిల ఆవేదన వ్యక్తంచేశారు. తన రాష్ట్ర పరిస్థితులను చక్కబెట్టాలని ప్రధానిని కోరారు. 'మణిపూర్ కాలిపోతోంది. రాష్ట్ర పరిస్థితులు కలచివేస్తున్నాయి. ఇద్దరు కుకీ వర్గ మహిళలను ప్రత్యర్థి వర్గంవారు బహిరంగంగా వివస్త్రలను చేసి ఊరేగించడం, వారిపై సామూహిక అత్యాచారానికి పాల్పడటం హేయమైన నేరం. ప్రధాని మోదీ తక్షణమే జోక్యం చేసుకోవాలి. మణిపూర్ ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. పరిస్థితిని అదుపు చేయడంలో రాష్ట్రం విఫలమైనప్పుడు ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారు? మణిపూర్ ప్రజలను కాపాడాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. మణిపూర్ ప్రజల కష్టాలను తీర్చేందుకు ఆయన తక్షణమే జోక్యం చేసుకోవాలి' అని అన్నారు. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ తన వైఫల్యాలను అంగీకరించాలని, రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని, 60 మంది ఎమ్మెల్యేలతో విడివిడిగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకొని సమస్య పరిష్కారానికి నిర్ణయం తీసుకోవాలని షర్మిల సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇదే సముచిత చర్యగా తెలిపారు. రాష్ట్రంలో ఇంటర్నెట్‌ను నిషేధించడం వల్ల కలిగిన ప్రయోజనం ఏమీ లేదన్నారు. ఒక వేళ ఇంటర్నెట్ సేవలు కొనసాగినట్లయితే బాధిత మహిళల (నగ్న ఊరేగింపు)కు న్యాయం జరిగి దోషులు కటకటాలు లెక్కిస్తుండేవారన్నారు. దోషులకు పెరోల్ లేని యావజ్జీవ కఠిన కరాగార శిక్ష విధించాలని షర్మిల డిమాండ్ చేశారు. సాయుధ దళాలకు ప్రత్యేక అధికారాల చట్టం (ఏఎఫ్ఎస్‌పీఏ) రద్దు కోసం 16 ఏళ్ల సుదీర్ఘ నిరాహార దీక్షను షర్మిల చేసిన విషయం విదితమే.

అవసరమైన శిక్షణ అందిస్తాం

మణిపూర్ క్రీడాకారులకు తమిళనాడు ప్రభుత్వం హామీ

చెన్నై: జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ అట్టుడుకుతోంది. ఈ ఘర్షణల్లో అనేక చోట్ల అమానవీయ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలోనే ఆ రాష్ట్ర క్రీడాకారులకు తమిళనాడు ప్రభుత్వం అండగా నిలిచింది. మణిపూర్ క్రీడాకారులకు కావాల్సిన శిక్షణను అందించేందుకు తమిళనాడు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. "ఖేలో ఇండియా, ఆసియా క్రీడలకు అవసరమైన శిక్షణ పొందేందుకు మణిపూర్ క్రీడాకారులకు ఆ రాష్ట్రంలో అనుకూలమైన పరిస్థితులు లేవు. అందుకే వారిని మా రాష్ట్రానికి ఆహ్వానిస్తున్నాం. తమిళనాడు క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ పర్యవేక్షణలో మణిపూర్ క్రీడాకారులకు అవసరమైన శిక్షణ అందిస్తాం" అని ఒక ప్రకటనలో స్టాలిన్ తెలిపారు. మణిపూర్ క్రీడాకారులకు అత్యున్నత స్థాయి నాణ్యత కలిగిన శిక్షణను అందించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేసినట్లు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చెప్పారు. "ఛాంపియన్లను తయారుచేయడంలో మణిపూర్‌కు ఎంతో పేరుంది. ముఖ్యంగా మహిళా ఛాంపియన్లను తయారు చేయడంలో ఆ రాష్ట్రం ఎప్పుడూ ముందుంటుంది. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిపై తమిళనాడు ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది" అని ఉదయనిధి స్టాలిన్ తెలిపారు.

దయచేసి మణిపూర్ అంశంపై

చర్చలో పాల్గొనండి

ప్రతిపక్షాలకు కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ విన్నపం

న్యూఢిల్లీ: మణిపూర్‌లో జాతుల హింసపై పార్లమెంటులో ప్రతిష్టంభన కొనసాగున్న నేపథ్యంలో ఈ అంశంపై చర్చలో పాల్గొనాలని ప్రతిపక్ష పార్టీలకు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ చేతులు జోడించి మరీ విజ్ఞప్తి చేశారు. ఈశాన్య రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను రాజకీయం చేయవద్దని ఠాకూర్ ప్రతిపక్షాలను కోరారు. మణిపూర్‌లో నెలకొన్న పరిస్థితులపై ప్రతిపక్షాలు సోమవారం పార్లమెంట్‌లో ఉమ్మడిగా నిరసనలు చేపట్టేందుకు సిద్ధమయ్యాయి. ఈ అంశంపై చర్చకు ముందు పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేయాలని ఆయా పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఈ అంశంపై ప్రధాని కాకుండా హోంమంత్రి అమిత్ షానే మాట్లాడతారని ప్రభుత్వం పట్టుబట్టింది. బాధితులు ఏ రాష్ట్రానికి చెందిన వారైనా మహిళలపై అఘాయిత్యాలు బాధాకరమని, ఇలాంటి ఘటనలను అరికట్టాల్సిన బాధ్యత రాష్ట్రానిదేనని మంత్రి ఠాకూర్ అన్నారు. రాజస్థాన్, బీహార్, పశ్చిమ బెంగాల్, మణిపూర్ వంటి రాష్ట్రాల్లో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల అంశంపై చర్చ జరగాలని ప్రభుత్వం ఆసక్తిగా ఉందన్నారు. 'అన్ని రాజకీయ పార్టీలు పాల్గొనే సభలో దీనిపై మంచి చర్చ జరగాలని మేము కోరుకుంటున్నాము. చర్చ నుండి ఎవరూ పారిపోవద్దు. ఇది ముకుళిత హస్తాలతో ప్రతిపక్షాలకు నా విన్నపం, చర్చ నుండి పారిపోకండి' అని ఠాకూర్ అన్నారు. ప్రతిపక్షాలు ఇలాంటి అంశాలను రాజకీయం చేయవద్దని, పార్లమెంటులో చర్చకు రావాలన్నారు.

రాజ్ ఠాక్రే కుమారుడ్ని ఆపినందుకు

టోల్ ప్లాజా ధ్వంసం

ముంబై: మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ ఠాక్రే కుమారుడు అమిత్ థాక్రేని ఆపినందుకు ఒక టోల్ ప్లాజాను ఆ పార్టీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. అమిత్ ఠాక్రే ప్రయాణించిన వాహనం, ఆయన కాన్వాయ్‌ను శనివారం రాత్రి సమృద్ధి ఎక్స్‌ప్రెస్‌వేపై ఉన్న సిన్నార్ టోల్ ప్లాజా వద్ద అర్ధగంటపాటు నిలిపివేశారు. ఐడీ కార్డులు చూపించాలని టోల్ గేట్ సిబ్బంది అడిగారు. దీంతో ఆగ్రహించిన ఎంఎన్ఎస్ కార్యకర్తలు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ ఘటన నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున 2.30 గంటలకు ఎంఎన్ఎస్ కార్యకర్తలు మూడు కార్లలో ఆ టోల్ ప్లాజా వద్దకు చేరుకున్నారు. కర్రలు చేతబట్టి టోల్ గేట్‌ను ధ్వంసం చేశారు. కాన్వాయ్‌ని అడ్డుకున్న సిబ్బందితో క్షమాపణలు చెప్పించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. మరోవైపు ఈ ఘటనపై పోలీసులు ఇప్పటి వరకు స్పందించలేదు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. అయినప్పటికీ వైరల్ అయిన వీడియో క్లిప్ ఆధారంగా కేసు నమోదు చేసి చర్యలు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

గుజరాత్‌లో కుంభవృష్టి

అహ్మదాబాద్ విమానాశ్రయం మునక

అహ్మదాబాద్: గుజరాత్‌లో గత కొన్ని రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. దాంతో రాష్ట్రంలోని అనేక చోట్ల లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. అహ్మదాబాద్ విమానాశ్రయంలోకి కూడా భారీగా వరద నీరు వచ్చి చేరింది. దాంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టెర్మినల్ ఏరియాలతోపాటు రన్‌వే పైకి కూడా వరద నీరు వచ్చి చేరింది. దాంతో ప్రయాణికులు సమయానికి తమ విమానాన్ని చేరుకోవడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారు. మోకాళ్ల లోతు నీళ్లలో ప్రయాణికులు అటూ ఇటూ నడవాల్సి వస్తున్నది. అహ్మదాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో వరద పరిస్థితిపై నెటిజన్‌లు రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ విమానాశ్రయంలో విమానాలు ఎగరడం కష్టమని, పడవలు సులభంగా పరుగులు తీస్తాయని ఓ నెటిజన్ పేర్కొన్నారు. ఇదిలావుంటే విమానాశ్రయంలోంచి వరద నీటిని తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గత 28 ఏళ్లలో అహ్మదాబాద్ విమానాశ్రయాన్ని వరదలు ముంచెత్తడం ఇదే తొలిసారని వారు తెలిపారు.

అతని సాహిత్యానికి జీవితమే ప్రేరణ

కేరళ జేసీబీ ఆపరేటర్ అఖిల్‌కు ప్రతిష్ఠాత్మక సాహిత్య పురస్కారం

కన్నూర్ (కేరళ): అతను రాత్రిపూట జేసీబీ ఆపరేటర్‌గా పని చేస్తాడు... ఉదయం వార్తాపత్రికలను అందజేస్తాడు... పనిలో అలసిపోయిన గంటలలో దీపంలా మెరుస్తూ రాయడమంటే అతనికి ఎంతో మక్కువ... అతనే కేరళ సాహిత్య అకాడమీ నుంచి సాహిత్య పురస్కారాన్ని గెలుచుకున్న సాహితీ కృషీవలుడు కె.అఖిల్. ఈ 28 ఏళ్ల యువకుడికి 2022 సంవత్సరానికి గాను కేరళ సాహిత్య అకాడమీ ప్రతిష్ఠాత్మక గీతా హిరణ్యన్ ఎండోమెంట్ పురస్కారాన్ని ప్రకటించింది. తన చిన్న కథల సంకలనం 'నీలచాడయన్'కు సాహిత్య అకాడమీ నుంచి ఈ పురస్కారాన్ని పొందాడు. అఖిల్ జీవితం బహుశా అతని పుస్తకాల వలె గొప్పది. 'నాకు లభించిన గుర్తింపు పట్ల నేను సంతోషంగా ఉన్నాను. ఇది ఊహించలేదు' అని అఖిల్ పీటీకి తెలిపారు. తన గురించి ఇంకా చాలా విషయాలు వెల్లడించారు. అఖిల్... తన కుటుంబాన్ని చూసుకోవడం కోసం తన చదువుకు స్వస్తి చెప్పవలసి వచ్చింది. ఎన్నికష్టాలు ఎదురైనా సాహిత్యంపై తనకున్న అభిరుచిని సజీవంగా ఉంచుకున్న ఈ యువకుడికి ఈ అవార్డు రావడం జాతీయ దృష్టిని ఆకర్షించింది. అతను మరింత చదవాలనుకున్నాడు కానీ తన తల్లిదండ్రులు, సోదరుడు, అమ్మమ్మలకు చేదోడుగా ఉండేందుకు ప్లస్-టూ (12వ తరగతి) తర్వాత చదువు కొనసాగించలేకపోయానని చెప్పాడు. అతని తల్లి కూడా దినసరి కూలీ. "నేను చాలా చిన్న వయస్సు నుంచి ఇంటింటికీ వార్తాపత్రికలు పంపిణీ చేసే 'డెలివరీ బాయ్'గా పనిచేయడం ప్రారంభించాను. నా కుటుంబాన్ని పోషించడానికి, నేను అర్ధరాత్రి నది నుంచి జరిగే ఇసుక తవ్వకాలతో సహా వివిధ ఉద్యోగాలు చేయాల్సి వచ్చింది" అని అఖిల్ తెలిపారు. రాత్రిపూట ఇసుక తవ్వే కార్మికునిగా పని చేస్తూ, పగలు వార్తాపత్రికలు వేసే పని ముగించేవాడు. అఖిల్ చాలా గంటలు ఒంటరిగా గడిపేవాడు. ఒంటరి రాత్రుల భయాన్ని పోగొట్టడానికి తన ఊహాశక్తిని ఉపయోగించి కథలు చెప్పడంలో సాంత్వన పొందాడు. "నేను నా దైనందిన జీవితంలో చాలా మందిని కలుస్తాను, నేను వారిని గమనిస్తాను మరియు వారి వివిధ అనుభవాలను వింటాను. రాత్రుల భయాన్ని, ఒంటరితనాన్ని పోగొట్టేందుకు పగటిపూట విన్న, చూసిన అనుభవాల ఆధారంగా కథలను ఊహించుకోవడం మొదలుపెట్టాను" అని అఖిల్ తెలిపారు. ఈ కృషి ఫలితమే "నీలచడాయాన్". ఇది కేరళలోని ఇడుక్కి జిల్లాలో లభ్యమయ్యే గంజాయి జాతి నుండి తీసుకోబడింది. పుస్తకంలోని కథలు ఉత్తర కేరళలోని సామాన్య ప్రజల జీవితాలను పరిశోధించాయి. ఉదాహరణకు, నృత్యం, మైమ్, సంగీతంతో కూడిన కళారూపాన్ని అభ్యసించే తెయ్యం కళాకారులు ఎదుర్కొంటున్న కష్టాలు. "నీలచాడయాన్" ఇప్పుడు ఎనిమిదవ ఎడిషన్‌లో ఉంది. అక్షరాస్యత చార్ట్‌లో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న తన రాష్ట్రానికి తన విజయాన్ని అంకితమిస్తున్నానని అఖిల్ గర్వంగా చెప్పాడు. అనేక ఇతర వర్ధమాన రచయితల మాదిరిగానే, ప్రచురణకర్తను కనుగొనడంలో అఖిల్‌కు సవాల్‌గా మారింది. 'దాదాపు నాలుగు సంవత్సరాలుగా, నేను నా రచనలను ప్రచురించడానికి అనేకమంది ప్రచురణకర్తలను, పత్రికలను సంప్రదించాను. కొంతమంది ప్రచురణకర్తలు కథలు ఇష్టపడ్డారు. కానీ నాకు ఈ రంగంలో పేరు లేనందున వాటిని మార్కెట్ చేయడం కష్టం అని నాకు చెప్పారు' అని అఖిల్ తెలిపాడు. తుదకు రచయిత సుమారు రూ. 20,000 చెల్లిస్తే పుస్తకాన్ని ప్రచురిస్తామన్న ప్రకటనను అఖిల్ ఫేస్‌బుక్‌లో చూసిన తర్వాత "నీలచాడయాన్" మొదట ప్రచురించబడింది. 'నా దగ్గర రూ. 10వేల పొదుపు సొమ్ము ఉంది. దినసరి కూలీ కూడా అయిన మా అమ్మ మరో రూ. 10వేలు నాకు సహాయం చేసింది. దీంతో నా మొదటి పుస్తకాన్ని ప్రచురించడానికి మేము డబ్బు చెల్లించాము. ఇది ఆన్‌లైన్ అమ్మకానికి మాత్రమే'అని అఖిల్ తెలిపాడు. ఈ పుస్తకం రాష్ట్రంలోని ఏ పుస్తక దుకాణంలోనూ అమ్మకానికి వెళ్లలేదు.. ఎటువంటి ప్రభావాన్ని సృష్టించలేదు. స్క్రీన్ రైటర్ బిపిన్ చంద్రన్ ఫేస్‌బుక్‌లో ఈ పుస్తకంపై ప్రశంసలు కురిపించడంతో మలుపు తిరిగింది. "ఆ తరువాత పాఠకులు పుస్తక దుకాణాలలో అడగడం ప్రారంభించారు. దీంతో ప్రచురణ ప్రారంభమైంది. ఇప్పుడు ఎనిమిదో ఎడిషన్ ప్రింట్‌లో ఉంది" అని అఖిల్ వివరించారు. అఖిల్ 2021లో తెయ్యం ఆధారంగా "స్టోరీ ఆఫ్ లయన్" 1ని రచించాడు. 2022లో రామాయణం ఆధారంగా "తారకంఠన్" రాశాడు. రెండు పుస్తకాలు ప్రస్తుతం మాతృభూమి బుక్స్ ద్వారా ప్రచురించబడ్డాయి. అఖిల్ రాత్రిళ్లు పనిచేయడం అతని సృజనాత్మక వ్యక్తీకరణకు పరిశోధనగా మారింది. ప్రతికూల పరిస్థితులపై అతని విజయం బహుశా అతని స్వంత కథలలో ఒకదానికి తగిన అంశంగా మార్చింది.

ఢిల్లీకి వరద ముప్పు

మళ్లీ పెరుగుతున్న యమున నీటిమట్టం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఈ క్రమంలో దేశ రాజధాని ఢిల్లీలో యమునా నది ప్రవాహం ఆదివారం మరోసారి ప్రమాదకరస్థాయి (205.33 మీటర్ల)ని దాటింది. దీంతో మరోసారి ఢిల్లీలో అనేక ప్రాంతాల్లో వరదలు తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా హత్నికుండ్ బ్యారేజ్ నుంచి నదిలోకి నీటిని విడుదల చేశారు. దీంతో యమునా నదిలో నీటిమట్టం ప్రమాదకరస్థాయికి చేరుకుంది. ఢిల్లీలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక, పునరావాస కార్యక్రమాలపై ఈ వరద ముప్పు ప్రభావం చూపించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. "హత్నికుండ్ బ్యారేజ్ నుంచి రెండు లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం వల్ల ఢిల్లీలోని కొన్ని ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాం. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ఢిల్లీ ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని ఢిల్లీ మంత్రి అతిషీ చెప్పారు. కుండపోత వర్షాల కారణంగా యమునా నది నీటి మట్టం గత వారం అత్యధికంగా 208.05 మీటర్లకు చేరింది. గత కొద్దిరోజులుగా నీటి మట్టం 205.02 మీటర్లుగా ఉంది. తాజాగా హత్నికుండ్ బ్యారేజ్ నుంచి నీటిని విడుదల చేయడంతో ఆదివారం ఉదయం నీటిమట్టం 206.07 మీటర్లకు చేరుకుంది. మరోవైపు జులై 25 వరకు ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కేంద్ర వాతావరణ శాఖ అంచనా వేసింది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, హరియాణా సహా యమునా ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలు వరదలకు కారణమయ్యాయి. వరదల కారణంగా 27,000 మందికి పైగా ప్రజలు తమ ఇళ్లను ఖాళీ చేసినట్లు అధికారులు తెలిపారు.

బీహార్, బెంగాల్, రాజస్తాన్‌తో పోలికా?

కుప్పకూలిన మణిపూర్ ప్రభుత్వం - కోమాలో కేంద్రం: చిదంబరం

న్యూఢిల్లీ: మణిపూర్‌లో పరిస్థితిని బీహార్, పశ్చిమ బెంగాల్, రాజస్తాన్ రాష్ట్రాలతో బీజేపీ పోల్చడాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం ఆక్షేపించారు. మణిపూర్‌లో ప్రభుత్వం కుప్పకూలిందని, కేంద్ర ప్రభుత్వం స్వయంగా విధించుకున్న కోమాలో ఉందని విమర్శించారు. మణిపూర్‌పై చర్చ నుంచి తప్పించుకునే ప్రయత్నాల్లో బీజేపీ ఉందని దుయ్యబట్టారు. మే4న మణిపూర్‌లో వెలుగుచూసిన అమానవీయ ఘటన క్రమంలో బీహార్, బెంగాల్, రాజస్తాన్ రాష్ట్రాల్లో మహిళలపై నేరాలు ఎక్కువని బీజేపీ ఆరోపించింది. వీటి గురించి విపక్షాలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించింది. దీంతో అధికార-విపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో చిదంబరం ట్విట్టర్ మాధ్యమంగా బీజేపీ వ్యాఖ్యలను తిప్పికొట్టారు. 'బీహార్, పశ్చిమ బెంగాల్, రాజస్తాన్ రాష్ట్రాల్లో మహిళలపై హింస జరిగిందనే అనుకుందాం. మరి మణిపూర్‌లో కొనసాగుతున్న హింసను ఎలా సమర్థించుకుంటారు? లోయ ప్రాంతంలో అసలు కుకీలు మిగిలివున్నారా? చురచాంద్పూర్‌తో పాటు ఇతర గిరిజిల్లాల్లో మయితె వర్గీయులు ఉన్నారా? అని ప్రశ్నించారు. తాజా వార్తాలను బట్టి మణిపూర్‌లో గిరిజన వర్గాలను తరిమేసినట్లు తెలుస్తోందని వ్యాఖ్యానించారు. మణిపూర్‌లో ప్రభుత్వం కుప్పకూలిందని, కేంద్రప్రభుత్వ సొంతంగా విధించుకున్న కోమా ఉందని చిదంబరం నొక్కిచెప్పారు. ఈశాన్య రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల అధికారం వారి ఇళ్లకే పరిమితమన్నట్లుగా పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉన్న మణిపూర్‌ను బీహార్, పశ్చిమ బెంగాల్, రాజస్తాన్‌తో ఎలా పోలుస్తారని బీజేపీని ప్రశ్నించారు. కేంద్రంలో ఉన్నది అసమర్థ, వివక్షపూరిత ప్రభుత్వమని దుయ్యబట్టారు. మణిపూర్‌లో అరాచకత్వానికి దీనిని సాగుగా చూపలేరని చిదంబరం వ్యాఖ్యానించారు.

మణిపూర్‌పై పార్లమెంటులో ప్రధాని ప్రకటన చేయాలి: ఫరూక్

శ్రీనగర్: హింసతో అట్టుడుకుతున్న మణిపూర్ పరిస్థితిపై ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్‌లో మాట్లాడాలని, ప్రతిపక్షాలు కూడా ఈ అంశంపై తమ అభిప్రాయాలను వెల్లడించాలని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా పేర్కొన్నారు. 'ప్రపంచం మొత్తం మణిపూర్ పరిణామాలపై మాట్లాడుతోంది... పీఎం ఈ అంశంపై చాలా బలమైన పదాలను ఉపయోగిస్తూ మాట్లాడారు... అయితే ప్రధాని దానిని పార్లమెంటులో చెప్పాలి. ఆయన మాట్లాడిన తర్వాత ప్రతిపక్షం చెప్పేది కూడా కూడా వినాలి. పార్లమెంటులో ఈ అంశంపై మాట్లాడేందుకు అనుమతిస్తారని ఆశిస్తున్నాం. మా లక్ష్యం విమర్శించడం కాదు, పరిస్థితి గురించి మా భావాలను వ్యక్తపరచడం' అని అబ్దుల్లా ఆదివారం ఇక్కడ విలేకరులతో అన్నారు. మణిపూర్‌లో ఇద్దరు కుకీ మహిళలను నగ్నంగా ఊరేగించిన వీడియోపై ప్రశ్నించగా... 'మణిపూర్ మనందరికీ విషాదం... ఇది ప్రతి భారతీయునికి అత్యంత దుర్దినం' అని అబ్దుల్లా అన్నారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటన 140 కోట్ల మంది భారతీయులకు సిగ్గుచేటని, చట్టం తన పూర్తి శక్తి సామర్థ్యాలతో పనిచేస్తుందని, దోషులను వదిలిపెట్టబోమని ప్రధాని మోదీ గురువారం అన్నారు. అధికారం కోసం కొందరు వ్యక్తులు ప్రజల మధ్య ద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నారని అబ్దుల్లా అన్నారు. 'ప్రజలను విభజించే అటువంటి శక్తిని నేను తృణీకరిస్తున్నాను. దేవుడు ఒక్కడే...అతను అందరికీ చెందినవాడు. మీరు అతన్ని ఏ రూపంలో చూడాలనుకుంటున్నారు అనేది మీ ఇష్టం. మీరు అతన్ని గుడిలో లేదా మసీదులో చూడాలనుకుంటున్నారు. అతను ఒక్కడే మిగిలాడు. అయినా మనం విభజించబడుతున్నాము. ఇది విచారకరం' అని ఫరూక్ అన్నారు.

గుజరాత్ సీజేగా సునీతా అగర్వాల్ ప్రమాణం

అహ్మదాబాద్: గుజరాత్ హైకోర్టు 29వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సునీతా అగర్వాల్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆమె గుజరాత్ హైకోర్టుకు రెండో మహిళా ప్రధాన న్యాయమూర్తి. గాంధీనగర్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ సునీతా అగర్వాల్ చేత ప్రమాణం చేయించారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, అసెంబ్లీ స్పీకర్ శంకర్ చౌదరి, న్యాయశాఖ మంత్రి రుషికేష్ పటేల్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అగర్వాల్ నియామకాన్ని సుప్రీంకోర్టు కొలీజియం జులై 5న ప్రతిపాదించింది. ప్రస్తుతం దేశంలోని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల్లో మహిళలెవరూ లేరు. సునీతా అగర్వాల్‌కు ముందు జస్టిస్ సోనియా గోకానీ ఫిబ్రవరి 25, 2023న పదవీ విరమణ చేయడానికి ముందు కొన్ని రోజులు గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు, ఆ తర్వాత జస్టిస్ ఏజే దేశాయ్ తాత్కాలిక సీజేగా పనిచేశారు. ఏప్రిల్ 30, 1966న జన్మించిన జస్టిస్ అగర్వాల్ 1989వ సంవత్సరంలో అవధ్ విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో పట్టభద్రుల య్యారు. ఆమె డిసెంబరు 16, 1990న న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. అలహాబాద్ హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. నవంబర్ 21, 2011న, ఆమె అలహాబాద్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.

అవినీతి కుంభకోణంలో 36 ఏళ్ల తర్వాత రిటైర్డ్ మిలిటరీ అధికారులకు శిక్ష

న్యూదిల్లీ: మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్ (ఎంఈఎస్) కోసం అధిక ధరలకు కొనుగోళ్లకు సంబంధించి రూ. 3.82 కోట్ల అవినీతి కుంభకోణంలో సీబీఐ ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన 36 ఏళ్ల తర్వాత లక్నోలోని ప్రత్యేక కోర్టు ఎనిమిది మందికి శిక్షలు విధించింది. ఇందులో ఇద్దరు రిటైర్డ్ లెఫ్టినెంట్ కల్నల్స్, ఒక మేజర్ ఉన్నారు. వీరికి మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. ఎంఈఎస్ అలహాబాద్ (కల్నల్ అడ్మినిస్ట్రేషన్, కమాండ్ స్టేషన్, శ్రీనగర్)లో కమాండర్ వర్క్స్ ఇంజనీర్ (సిడబ్ల్యుఇ) నియమితులైన లెఫ్టినెంట్ కల్నల్ సత్యపాల్ శర్మ (రిటైర్డ్)కు ఇటీవల ప్రత్యేక కోర్టు శిక్ష విధించిందని సీబీఐ తెలిపింది. శర్మతో పాటు శిక్ష పడిన వారిలో వైకే ఉప్పల్ అప్పటి గారిసన్ ఇంజనీర్ (పశ్చిమ); కేఎస్ సైనీ (లెఫ్టినెంట్ కల్నల్), బీ వీరేంద్ర కుమార్ జైన్, అప్పటి గారిసన్ ఇంజనీర్ (తూర్పు), ఎస్ఎస్ ఠక్కర్ (మేజర్), అప్పటి గారిసన్ ఇంజనీర్ (ఎయిర్ ఫోర్స్) ఉన్నారు. వీరితో పాటు వివిధ కల్పిత సంస్థల యజమానులు, భాగస్వాములుగా ఉన్న అశోక్ కుమార్ దేవరా, అనిల్ కుమార్ దేవరా, పవన్ కుమార్ దేవరాకు కోర్టు శిక్ష విధించిందని సీబీఐ ప్రతినిధి తెలిపారు. నవంబర్ 1983 నుంచి నవంబర్ 1985 వరకు నిర్దేశించిన మార్గదర్శకాలను ఉల్లంఘించి అధిక ధరలకు స్థానికంగా భారీగా కొనుగోళ్లు జరిపారనే ఆరోపణలపై 1986 సెప్టెంబర్ 25న సీబీఐ కేసు నమోదు చేయగా నాలుగేళ్లలో సీబీఐ తన చార్జ్ షీట్‌ను డిసెంబర్ 19, 1990 న దాఖలు చేసింది. ఏప్రిల్ 29, 2002 న అభియోగాలను నిర్ధారించింది. కాగా అలహాబాద్ హైకోర్టు 2002 లో విచారణను నిలిపివేసింది. 17 సంవత్సరాల తర్వాత 2019లో 'స్టే' ఎత్తివేయగా మళ్లీ విచారణ ప్రారంభమైందని అధికారులు తెలిపారు.

దిల్లీ ఆర్డినెన్స్ రాజ్యాంగ విరుద్ధం

రాజ్యసభలో ప్రవేశపెడితే ఆమోదించొద్దు

ధన్కర్‌కు ఆప్ ఎంపీ రాఘవ్ చడ్డా లేఖ

న్యూదిల్లీ: దిల్లీలో అధికారుల బదిలీ, నియామకాలకు సంబంధించిన కేంద్ర ఆర్డినెన్స్ రాజ్యాంగానికి విరుద్ధమని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపీ రాఘవ్ చడ్డా అన్నారు. రాజ్యసభలో ప్రవేశ పెట్టినప్పుడు ఆమోదించవద్దని కోరుతూ చైర్మన్ జగదీప్ ధన్కర్‌కు ఆదివారం లేఖ రాశారు. ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని కేంద్రానికి సూచించాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరారు. ఇది సర్వోన్నత న్యాయస్థానం పరిశీలనలో ఉన్నందున, బిల్లును పార్లమెం టులో ప్రవేశపెట్టేందుకు ముందు కోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకోవడం, తాజా ఉత్తర్వుల కోసం ఆగడం సబబుగా ఉంటుందని చడ్డా సూచించారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో దిల్లీ ఆర్డినెన్స్‌ను ప్రవేశపెట్టనున్న క్రమంలో ధన్కర్‌కు ఈమేరకు లేఖను చడ్డా రాశారు. దిల్లీలో గ్రూపు-ఎ అధికారుల బదిలీ, నియామకాల అధికారం కోసం మే 19న ఈ ఆర్డినెన్స్‌ను కేంద్రం తీసుకొచ్చింది. ఇందుకు అధికారుల నియామకాలు, బదిలీ అధికారాన్ని స్థానికంగా ఎన్నికైన ప్రభుత్వానికి ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పు ఇవ్వడాన్ని లేఖలో రాఘవ్ చడ్డా ప్రస్తావించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వానికి జవాబుదారీ కీలకమన్నారు. ఒక్క దెబ్బతో దిల్లీ ప్రభుత్వ చేతుల్లోని అధికారాలను లెఫ్టినెంట్ గవర్నర్‌కు కేంద్రం అప్పగించిందని, ఈ ఆర్డినెన్స్... దిల్లీ ఎన్‌సీటీ ప్రభుత్వానికి అధికారాలు లేకుండా చేసేందుకే రూపొందిందని చడ్డా ఆరోపించారు. కేంద్రప్రభుత్వ వైఖరి దిల్లీలో పరిపాలన సంక్షోభానికి దారితీశాయని, ప్రభుత్వ ఆదేశాలను అధికారులు ధిక్కరించే స్థితి నెలకొందని అన్నారు. రాజ్యాంగానికి పూర్తి విరుద్ధంగా రూపొందిన ఈ ఆర్డినెన్స్‌ను ఎట్టిపరిస్థితుల్లో ఆమోదించవద్దని ధన్కర్‌ను చడ్డా కోరారు.

కంబోడియాలో 81.48శాతం పోలింగ్

ఫ్నోమ్ పెన్: కంబోడియాలో ఏడవ సార్వత్రిక ఎన్నికలు ఆదివారం జరిగాయి. 81.48శాతం ఓటింగ్ నమోదు అయినట్లు జాతీయ ఎన్నికల కమిటీ (ఎన్ఈసీ) అధికార ప్రతినిధి తెలిపారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలు కాగా సాయంత్రం 3.40గంటల వరకు 7,912,081 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అర్హులైన ఓటర్లు 9, 710,655 మంది కాగా దేశంలో 23,739 పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ జరిగినట్లు ఎన్ఈసీ అధికార ప్రతినిధి డిమ్ సోవన్నరోమ్ వెల్లడించారు. ఆదివారం సాయంత్రానికి ఓట్ల లెక్కింపు మొదలు కాగా ఫలితాలను అధికారికంగా ఆగస్టు 9న ప్రకటిస్తారు. 18 పార్టీలు పోటీ పడ్డాయి. నేషనల్ అసెంబ్లీకి ఐదేళ్ల పదవీ కాలం కోసం 125 మంది ఎన్నిక కానున్నారు. 2018 ఎన్నికలను కొంబోడియన్ పీపుల్స్ పార్టీ (సీపీపీ) క్లీన్‌స్వీప్ చేసింది. మొత్తం 125 స్థానాలను గెలుచుకుంది. ఈసారి కూడా అదే పార్టీ ఘన విజయం సాధిస్తుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్రధాని సందేచ్ టెక్నో హున్ సెన్ తిరిగి అధికార పగ్గాలను చేపట్టవచ్చన్న అంచనాలు ఉన్నాయి. కాగా, ఈ ఎన్నిక ఏకపక్షమన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమైంది.

తరలిపోతున్న మిజో-మయితేలు

ఇంఫాల్: మణిపూర్‌లో పరిస్థితులు నానాటికీ క్షీణిస్తున్నాయి. కుకీ వర్గానికి చెందిన ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి వారిపై సామూహిక అత్యాచారానికి ప్రత్యర్థి వర్గం పాల్పడటంతో సర్వత్రా నిరసనలు వ్యక్తమయ్యాయి. ఈ పరిస్థితుల్లో ప్రాణ భయంతో మిజోరం మయితేలు మణిపూర్‌ను వదిలి వెళ్లిపోతున్నారు. గతంలోని మిజో నేషనల్ ఫ్రంట్ మిలిటెంట్స్‌తో ముడిపడ్డ పీస్ అకార్డ్ ఎంఎన్ఎఫ్ రిటర్నీస్ అసోసియేషన్ (పీఏఎంఆర్ఏ) ఈనెల 21న ఓ ప్రకటన వెలువరించి మణిపూర్‌లోని మిజోరం మయితేలు వెళ్లిపోవాలని సూచించింది. దీంతో తమను తాము కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా మణిపూర్ నుంచి ఈ గిరిజన తెగ తరలిపోతోంది. దీనిపై మణిపూర్ ప్రభుత్వం స్పందిస్తూ మిజోరం మయితే వర్గీయుల తరలింపు కోసం చార్టెర్డ్ ఫ్లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించింది. ప్రాణాపాయం లేదని మయితే వర్గీయులకు మిజోరం హోంశాఖ అభయమిచ్చింది. మిజోరం హోం కమిషనర్ హెచ్ లాలెంగ్మావియా మాట్లాడుతూ పీఏఎంఆర్ఏతో మాట్లాడాను, తమ సందేశాన్ని తప్పుగా అన్వయించినట్లు వారు చెబుతున్నారు. బెదిరిం పులకు పాల్పడలేదని, వారి గురించి ఆందోళన చెంది ఈ ప్రకటన చేశామన్నారు. తాజా పరిణామాల క్రమంలో మిజోరంలోనూ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మిజోరం యూనివర్సిటీ, వెటీ కాలేజి, తన్హరిల్, రిపాన్స్, జెమాబాక్, జెడ్ఎంసీ, ఫల్కావన్‌లో భద్రతను పెంచారు. మిజో-మయితే వర్గీయులు మణిపూర్‌లోని కుకీ-జోమిస్‌తో ముడిపడి ఉన్నారు. వీరి జనాభా 12,584గా ఉంది. మిజోరం మయితేలు చాలా వరకు ఐజ్వాల్‌లో ఉంటారు. వీరంతా రెండు వేల మందికి మించి ఉండరు.

మీరా పైబిస్ మహిళలే నన్ను అప్పగించారు : అత్యాచార బాధితురాలు మే 15న మణిపూర్‌లోని తూర్పు ఇంఫాల్ జిల్లాలో 18ఏళ్ల యువతి అపహరణ, వేధింపులు, సామూహిక అత్యాచారానికి గురైంది. తనను నలుగురు సాయుధ దళసభ్యులకు మీరా పైబీ మహిళలే అప్పగించారని ఈనెల 21న పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. తీవ్రంగా గాయపడిన ఆమె నాగాలాండ్ ఆసుపత్రిలో కోలుకుంటోంది.

రాష్ట్రానికి పట్టిన గ్రహణాన్ని వదిలించటానికే కొత్త పార్టీ

- ప్రజా సింహగర్జన సభలో బోడే రామచంద్రయాదవ్
- భారత చైతన్య యువజన పార్టీ ఆవిర్భావం
- భారీగా తరలివచ్చిన జనం

విశాలాంధ్ర-మంగళగిరి: రాష్ట్రంలో భారత చైతన్య యువజన పార్టీ(బీసీవైపీ) పేరుతో మరో కొత్త పార్టీ ఏర్పాటైంది. పుంగనూరుకు చెందిన పారిశ్రామికవేత్త బోడే రామచంద్రయాదవ్ అధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట ఆదివారం సాయంత్రం ప్రజా సింహ గర్జన బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలోనే రామచంద్రయాదవ్... తాను కొత్తగా ఏర్పాటు చేసిన పార్టీ పేరు 'భారత చైతన్య యువజన పార్టీ'గా ప్రకటించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ చంద్రయాదవ్ మాట్లాడుతూ జులై 23వ తేదీ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. రాష్ట్రానికి పట్టిన గ్రహణాన్ని వదిలించడానికే కొత్త పార్టీ పెట్టామని చెప్పారు. ఘనచరిత్ర ఉన్న ఆంధ్ర రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయ న్నారు. రాష్ట్రంలో రైతులు, యువకులు, మహిళలు పరిస్థితి ఎలా ఉంది... ఎలా ఇబ్బందులుపడుతున్నారో అందరికీ తెలిసిందేనన్నారు. ప్రభుత్వాలు మారినా రైతుల వలసలు ఆపే పరిస్థితుల్లో పాలకులు లేరని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, నీటి ప్రాజెక్ట్ పేర్లతో వేల కోట్లు దోపీడి చేస్తున్నారని ఆరోపించారు. ఎర్రచందనం దోపీడీ జరుగుతోందన్నారు. దీర్ఘకాలం రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్, టీడీపీలు రాష్ట్రానికి చేసింది శూన్యమన్నారు. రాష్ట్రం విడిపోతుంటే అపలేని పరిస్థితిలో ఆ పార్టీలు ఉన్నాయన్నారు. విజయవాడ, గుంటూరు నగరాల మధ్య రాజధాని అభివృద్ధి చేసే అవకాశం ఉన్నప్పటికీ టీడీపీ తన సొంత సామాజికవర్గ అభివృద్ధి కోసం పనిచేసిందని ఆరోపించారు. వైసీపీ అవిర్భావమే దౌర్భగ్యం కాగా, 2019లో రాక్షస పాలకు ప్రజలు మద్దతు ఇవ్వటం బాధకరమన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో రాక్షస పాలనను ప్రజలు అనుభవిస్తున్నారన్నారు. దుర్మార్గపు దోపిడీ, దౌర్జన్యపు ప్రభుత్వం అని తీవ్రంగా దుయ్యబట్టారు. హత్యలు, మానభంగాలు పెరిగిపోగా, ప్రభుత్వ భూములు దోచుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఇసుక తరువాత లిక్కర్ స్కాం ప్రధానమైందన్నారు. లిక్కర్ స్కాం నగదు తాడేపల్లిలోని సీఎం నివాసానికి వెళ్తోందని ఆరోపించారు. సినిమా రిలీజ్‌కు 20 శాతం కమీషన్ కప్పం కట్టాల్సిన దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపించారు. బీసీ, ఎస్సీ, మైనార్టీల అభివృద్ధి జరగాలంటే దోపీడీ, కుటుంబ, హత్యలు, వెన్నుపోటు రాజకీయ పార్టీలకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు.

పార్టీ మేనిఫెస్టో ప్రకటన:

పార్టీ జెండా ఆవిష్కరణ అనంతరం రామచంద్రయాదవ్ మాట్లాడుతూ పార్టీ మేనిఫెస్టోను ప్రకటించారు. రాష్ట్ర ప్రజలకు ఉచితంగా ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహించటం, యువతకు ఉచిత విద్య, ఉపాధి, కల్పించేందుకు బీసీవైపీ పనిచేస్తుందన్నారు. ప్రతి ఇంటికి ఒక ఆవును ఉచితంగా ఇస్తామని ప్రకటించారు. ఆవు ప్రతి ఇంటికి శుభసూచకం అన్నారు. తాము అధికారంలోకి వస్తే కౌలు రైతులు చెల్లించే కౌలును ప్రభుత్వమే భరిస్తుందన్నారు. యువతకు ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగభృతి రూ.2500లు ఇస్తామని ప్రకటించారు. త్వరలో విజయవాడ ప్రాంతంలో 500 కంపెనీలతో 50 వేల మంది యువతకు ఉపాధి కల్పించేలా మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని ప్రకటించారు. డ్వాక్రా మహిళలకు రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తామని, మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేసేందుకు కృషి చేస్తామని రామచంద్రయాదవ్ అన్నారు. తొలుత సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సభలో బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్, సూరజ్ మండల్ తదితరులు పాల్గొన్నారు. వర్షం కురుస్తున్నప్పటికీ బహిరంగసభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

30న పీఎస్ఎల్వీ సి-56 రాకెట్ ప్రయోగం

విశాలాంధ్ర-సూళ్ళూరుపేట: శ్రీహరికోట లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఈనెల 30వ తేదీ పీఎస్ఎల్వీ సి-56 రాకెట్‌ను ప్రయోగించన ున్నారు. ఇందులో సింగపూర్ కి చెందిన ఏడు ఉపగ్రహాలను అమర్చి నింగిలోకి పంపేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. 30వ తేదీ ఉదయం 6 గంటల 30 నిమిషాలకు సి-56 నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి వెళ్లనుంది. డీఎస్ఎస్ఏఆర్ ప్రధాన ఉపగ్రహం కాగా, మరో మూడు ఉపగ్రహాలు, మరో మూడు నానో ఉపగ్రహాలను ఈ రాకెట్ అంతరిక్షంలో 535 కిలోమీటర్ల దూరంలోని ఎర్త్ ఆర్బిట్లో ప్రవేశ పెట్టాల్సి ఉంది. సింగపూర్ దేశానికి సంబంధించిన అంతరిక్ష కక్ష్యను చేరుకోవడానికి అనువైన సమయం తెల్లవారుజామేనని శాస్త్రవేత్తలు తెలిపారు. అటు సింగపూర్ శాస్త్రవేత్తలు, ఇటు ఇస్రో శాస్త్రవేత్తలు శ్రీహరికోటలో ఈ ప్రయోగానికి సంబంధించి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

వరద గుప్పిట్లో తూర్పు కెనడా

నోవా స్కాటియాలో ఎమర్జెన్సీ

ఒట్టావా: తూర్పు కెనడాలోని నోవా స్కాటియా, మాంట్రియల్ ప్రావిన్స్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. 50ఏళ్లలో లేనంతగా వరదపోటకు నోవా స్కాటియా గురైంది. వంతెనలు, రహదారులు తెగిపోయాయి. సుమారు 4వేల మంది అంధకారంలో చిక్కుకుపోయారు. భవనాలు కూలిపోయాయి. అనేక ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కనీసం ఏడు వంతెల పునర్నిర్మాణం అవసరమైందని నోవా స్కాటియా ఉన్నతాధికారి టిమ్ హౌస్టన్ వెల్లడించారు. ఆస్తినష్టం భారీగా సంభవించిందన్నారు. ఫెడరల్ ప్రభుత్వం నుంచి సముచిత సాయాన్ని తమ ప్రావిన్స్ కోరుతోందన్నారు. వరద పోటు కారణంగా ఆగస్టు 5 వరకు ఎమర్జెన్సీ అమల్లో ఉంటుంది. ఆ తర్వాత పరిస్థితులను బట్టి ఎమర్జెన్సీని కొనసాగించాలో లేదో ప్రభుత్వం నిర్ణయిస్తుందని అధికారులు వెల్లడించారు. వరదలు బీభత్సం సృష్టిస్తున్నట్లు అత్యవసర ప్రతిస్పందన మంత్రి జాన్ లోహ్ర్ తెలిపారు. 24 గంటల్లో 300 ఎంఎంల వర్షపాతం నమోదు కాగా మరికొన్ని చోట్ల 75 నుంచి 150 ఎంఎంల వరకు అధిక వర్షాలు కురిసే అంచనాలున్నట్లు కెనడా పర్యావరణ కేంద్రం తెలిపింది. ప్రజలెవ్వరూ గడప దాటవద్దని, అంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి హెచ్చరికలు జారీ చేశారు. దెబ్బతిన్న రోడ్లు, విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వరదలో వాహనాలు కొట్టుకుపోయి నలుగురు గల్లంతయ్యారని రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీసులు తెలిపారు. ప్రావిన్స్‌కు అవసమైన సహాయ, సహకారాలను అందిస్తున్నట్లు కెనడా ప్రధాని జస్టిస్ ట్రుడ్యు తెలిపారు. ఒట్టావా అండగా నిలుస్తుందని హామీనిచ్చారు. తుపాను పరోగమిస్తుండటంతో ప్రావిన్స్‌ను దాని ప్రభావం నుంచి కాపాడేందుకు ఎమర్జెన్సీ విధించినట్లు ప్రావిన్స్ ప్రభుత్వ అత్యవసర నిర్వహణ కార్యాలయం వెల్లడించింది.

'కొరియా ఓపెన్' భారత్ కైవసం

యోసు (కొరియా): కొరియా ఓపెన్ సూపర్ 500 షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్‌శెట్టి జోడీ మరోసారి తమ సత్తాను చాటారు. హోరాహోరీగా జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్స్‌లో ఇండోనేశియాకు చెందిన టాప్ సీడ్ ఫజర్ అల్ఫియాన్-ముహమ్మద్ రియాన్ జంటపై 17-21, 21-13, 21-14 తేడాతో ఘనం విజయాన్ని సాధించారు. తొలి గేమ్‌ను 17-21లో ఓడినప్పటికీ రెండో గేమ్‌లో వేగం పుంజుకున్న ఈ జోడి... ప్రత్యర్థి జంట చేస్తున్న సర్వీస్‌ని పదే పదే బ్రేక్ చేస్తూ ఆధిక్యం లో దూసుకెళ్లారు. అలా 21-13తో రెండో గేమ్‌ను సొంతం చేసుకున్నారు.







Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.